ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 3, సెప్టెంబరు 2025



ఒంగోలులో మూసివేసి ఉన్న మహిళా మార్ట్

మహిళా మార్ట్ మూత

పర్యవేక్షకుడైన మార్కెటింగ్ అధికారి జేబులోకి లావాదేవీల సొమ్ము?

ఒంగోలులోని మహిళా మార్ట్ మూతపడింది. క్రయ విక్రయాలకు సంబంధించి బాధ్యుడిగా ఉన్న అధికారి చేతివాటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రతి రోజూ అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును మార్ట్ బ్యాంక్ ఖాతాలో జమచేయకుండా ఆయన తన జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేసమయంలో సరుకులు కూడా మాయమయ్యాయి. సదరు ఉద్యోగికి తాజాగా ఒంగోలు సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)-2గా బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. నెల రోజులుగా మహిళా మార్ట్ మూతపడటంతో పొదుపు సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తాము చెల్లించిన సొమ్ముకు బాధ్యులెవరు అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం.. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే ధ్యేయం అంటూ గత వైసీపీ హయాంలో ఆర్భాటంగా ప్రారంభించిన మహిళా మార్ట్ రెండేళ్లకే మూతపడింది. పొదుపు సంఘాల సభ్యులు తయారుచేసే సరుకులు, తినుబండారాలను మార్ట్‌ల ద్వారా విక్రయించి ఆదాయ వనరులు సమకూర్చాలని భావించారు. నగరంలోని ఊరచెరువులో గతంలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల కేంద్రం (నైట్ షెల్టర్)లో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో ప్రతి పొదుపు సంఘం నుంచి రూ.1,500 ముక్కుపిండి మరీ వసూలు చేశారు. అందుకుగాను ఒక్కో సభ్యురాలు రూ.150 చొప్పున చెల్లించారు. ఆతర్వాత పొదుపు సంఘాలు తయారు చేసే నిత్యావసర సరుకులు కాకుండా ప్రైవేటు మార్కెట్ ద్వారా కొనుగోలు చేసి పొదుపు సభ్యుల చేత బలవంతంగా అమ్మకాలు చేయించారు. అయితే ప్రస్తుతం ఆ మహిళా మార్ట్ మూతపడింది. దాని బాధ్యతలను పర్యవేక్షిస్తూ, క్రయవిక్రయాలకు బాధ్యుడుగా ఉన్న అధికారి చేతివాటం చూపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సేల్స్ గర్ల్స్‌గా ఆర్పీలు

మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడిపించేందుకు ఆర్పీలను సేల్స్ గర్ల్స్‌గా మార్చేశారు. రోజుకు ఇద్దరికి చొప్పున మార్ట్ డ్యూటీలు వేయడంతోపాటు వారికి టార్గెట్‌లు నిర్ణయించారు. వారి పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులకు సరుకులు అంటగట్టారు. మార్ట్‌లో సరుకు మాకొద్దంటూ కొందరు అభ్యంతరం తెలిపినా మెప్మా రూల్స్ పాటించాల్సిందేనంటూ కొనుగోలు

మిగతా 6వ పేజీలో

- పొదుపు సభ్యులకు శఠగోపం
- ఒక్కో గ్రూపు నుంచి రూ.1,500 వసూలు
- ఒక్కరూపాయి కూడా తిరిగి ఇవ్వని వైనం
- ప్రస్తుతం డబ్బుల్లేవ్.. సరుకుల్లేవ్!
- వైసీపీ హయాంలో ఆర్భాటంగా ప్రారంభం
- రెండేళ్లు కూడా పూర్తికాకుండానే క్లోజ్



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

- రెండో విడత 19 మంది అభ్యర్థులు హాజరు
- నేటి నుంచి మంగళగిరిలో తుది ఎంపిక ప్రక్రియ



సర్టిఫికెట్ల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ రెండో విడత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. 19 మంది హాజరయ్యారు. మొదటి విడత పరిశీలనకు హాజరైన 657 మందిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించారు. దరఖాస్తులో వారి ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని మిగిలిన పోస్టులకు మెరిట్‌లో వారి తర్వాత ఉన్న వారిని ప్రస్తుతం పరిశీలనకు ఆహ్వానించారు. వీరి సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. సాయంత్రానికి 19మంది అభ్యర్థులు రావడంతో పరిశీలనను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ 19మందిలో ఏడుగురు దివ్యాంగులు ఉన్నారు. వీరిలో నలుగురు శారీరక దివ్యాంగులు కాగా, ముగ్గురు వినికిడి లోపం ఉన్నవారు. వీరి వైకల్య ధ్రువీకరణ పత్రాలను పునఃపరిశీలనకు పంపారు. వినికిడిలోపం ఉన్న వారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు, శారీరక వైకల్యం వారిని ఒంగోలు రిమ్స్‌కు సిఫార్సు చేశారు. వీరు ఆయా మెడికల్ బోర్డుల ముందు వైద్య పరీక్షలకు హాజరుకావాలి. మెడికల్ బోర్డు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలను డీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డీఎస్సీ రెండు విడతల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికావడంతో బుధవారం నుంచి మంగళగిరిలోని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల తుది ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.



బార్లకు లాటరీ ప్రక్రియను నిర్వహిస్తున్న డీఆర్వో ఓబులేశు, ఎక్సైజ్ అధికారులు

నాలుగు బార్లకు లాటరీ

- మార్కాపురంలో మిగిలిపోయిన ఒక బార్

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిగిలిపోయిన బార్లకు రెండోసారి లాటరీ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఐదింటికి దరఖాస్తులు ఆహ్వానించగా నాలుగు మాత్రమే నిబంధనల ప్రకారం లాటరీకి ఎంపికయ్యాయి. మంగళవారం ప్రకాశం భవన్‌లో డీఆర్వో చిన ఓబులేశు సమక్షంలో నాలుగు బార్లకు లాటరీ తీసి యజమానిని ఎంపిక చేశారు. వాటిలో ఒంగోలులో మూడు, మార్కాపురంలో ఒక బార్ ఉన్నాయి. మార్కాపురంలో ఇంకో బార్‌కు నాలుగు దరఖాస్తులు రానందున లాటరీ నిలిపివేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషాబేగం, ఏఈఎస్ యర్ర వెంకట్, చీమకుర్తి సీఐ సుకన్య పాల్గొన్నారు.



వేగంగా రేషన్ పంపిణీ

- రెండు రోజుల్లో 39.77 శాతం మందికి సరుకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ పంపిణీ వేగంగా జరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి 39.77శాతం మందికి సరుకులు అందాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దుకాణాల ద్వారా రెండు పూటలా కార్డుదారులకు సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో త్వరగా రేషన్ అందుతోంది. జిల్లాలో 38 మండలాలు ఉండగా మంగళవారం సాయంత్రానికి 39.77శాతం మందికి సరుకులు అందాయి. ఒంగోలు డివిజన్‌లో 509 రేషన్ షాపుల పరిధిలో 2,54,727 కార్డులు ఉండగా 98,238 కార్డుదారులు రేషన్ అందుకున్నారు. కనిగిరి డివిజన్‌లో 424 షాపుల పరిధిలో 1,96,148 కార్డులు ఉండగా మంగళవారం సాయంత్రానికి 79,659 మందికి రేషన్ పంపిణీ జరిగింది. మార్కాపురం డివిజన్‌లో 459 షాపుల పరిధిలో 2,10,266 కార్డులు ఉండగా 85,054 మంది రేషన్ అందుకున్నారు. జిల్లా మొత్తంగా చూస్తే 1,392 దుకాణాల పరిధిలో 6,61,141 కార్డులు ఉండగా 2,62,952 కార్డుదారులు రేషన్ తీసుకున్నారు.

బ్లాక్ మార్కెట్‌పై పోలీసుల కన్ను

- జిల్లావ్యాప్తంగా 121 ఎరువుల దుకాణాలలో తనిఖీలు
- అక్రమాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ దామోదర్



ఒంగోలులోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా 121 ఎరువుల దుకాణాలలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న ఎస్పీ తనిఖీలకు ఆదేశించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎరువుల షాపుల్లో రికార్డులు, నిల్వలను పరిశీలించారు. ఎక్కడా అవతవకలను గుర్తించిన దాఖలాలు కనిపించలేదు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

గురువా.. స్పందనేది!

- అంతంతమాత్రంగానే పోటీ
- 60 ఉత్తమ టీచర్ అవార్డులకు 56 దరఖాస్తులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు స్పందన అంతంతమాత్రంగా ఉంది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిభావంతులైన టీచర్లను ఎంపిక చేసి గురుపూజోత్సవం రోజున వారికి అవార్డులు ప్రదానం చేసి గౌరవించడం ఆనవాయితీ. ఈ అవార్డుల పొందిన వారికి సమాజంలో గుర్తింపు, గౌరవం చూసి టీచర్లు పోటీ పడుతుంటారు. అవసరమైతే రాజకీయ నాయకులు, అధికారులతో సిఫార్సులు కూడా చేయిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ అవార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు టీచర్లు ముందుకు రావడం లేదు. గతంలో దరఖాస్తు చేసేందుకు కనీసం వారం పదిరోజులు ముందు డీఈవోలు పత్రికా ప్రకటన ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం డీఈవో 22న

మిగతా 6వ పేజీలో

అరుణ దందాలపై పోలీసుల ఆరా

- వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులతో సంబంధం
- పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల పరిశీలన

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : లేడీ డాన్‌గా నేర సామ్రాజ్యాన్ని విస్తరించిన అరుణ చేసిన అక్రమాలపై నెల్లూరు పోలీసులతోపాటు మన జిల్లా పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దిశ పేరుతో ఎన్‌జీవో నడిపిన అరుణ పోలీసు స్టేషన్లలో చేసిన దందాలు అన్నీఇన్నీ కావని తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తుండగా పోలీసులు వరుసగా సంబంధిత అంశాలపై విచారణ చేస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న అరుణను ఇటీవల నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు తమ కస్టడీకి తీసుకొని మూడు రోజులు విచారించారు. ఆ సమయంలో ప్రకాశం జిల్లాలో అరుణ నేర సామ్రాజ్యం గురించి కొన్ని నిజాలు బయటకు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో తెలుగుదేశం

మిగతా 6వ పేజీలో





కమల వెస్లీ మృతదేహానికి వందనం చేస్తున్న ఎస్పీ దామోదర్

తనయుడి వర్ధంతి... తల్లి మృతి

- దివంగత పోలీసు వెస్లీ మాతృమూర్తి కన్నుమూత
- నివాళులర్పించిన ఎస్పీ దామోదర్

వివరాలు మెయిన్‌లో..

ప్రభుత్వాలు మారినా తీరని భూసమస్యలు

- పరిష్కారానికి నోచుకోని రీసర్వే తప్పులు
- ఆందోళనలో రైతులు
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

6





ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఒంగోలులో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడైన ఒడా చైర్మన్ రియాజ్, ఆ పార్టీ నాయకుడు కంది రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. : లోపలి పేజీల్లో..

న్యాయం కావాలి..

- పురుగు మందు తాగి భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం
- వెంటనే ఆసుపత్రికి తరలింపు
- గిద్దలూరు కోర్టు ఆవరణలో ఘటన

6

కళా ఉత్సవ్.. భళా..!

జవహర్ నవోదయ విద్యార్థుల కళా ఉత్సవాలు కనుల పండువలా సాగాయి. 'వికసిత్ భారత్' పేరుతో ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలకు ఒంగోలు వేదికైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాలలోని పలు జేఎన్‌వీ విద్యాలయాల నుంచి సుమారు 164 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆటపాటలు, నృత్యాలతో అలరించారు.

7

ప్రభుత్వాలు మారినా తీరని భూసమస్యలు

- పరిష్కారానికి నోచుకోని రీసర్వే తప్పులు
- ఆందోళనలో రైతాంగం
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

తాళ్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా భూసమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవటం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పులను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకవచ్చిన ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మేనేజ్‌మెంట్) విధానాలతో భూములు, స్థలాల అమ్మకాల కొనుగోలుకు ఇబ్బందులు తప్పటం లేదు. గత వైసీపీ ప్రభుత్వం శాశ్వత భూహక్కు కల్పిస్తామని ఎంతోఆర్భాటంగా చేపట్టిన భూరీసర్వే రైతులపాలిట గుదిబండలా మారింది. ఈ సమస్యలు పరిష్కరించటానికి రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో ఆరుచోట్ల పూర్తి చేశారు. మల్కాపురం, శివరాంపురం, దోసకాలపాడు, మాధవరం, శంకరనారాయణపురం, సార్వమిట గ్రామాల్లో గత ఏడాది రీసర్వే నిర్వహించారు. ఈసర్వే జరిగిన ప్రతిగ్రామంలో రికార్డులు తప్పులు తడకగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ అధికారుల్లు భూముల హక్కులు గలిగిన రైతులను సంప్రదించకుండా డ్రోన్ కెమెరా ఆధారంతో రీసర్వే జరపటంతో భూముల హద్దులు తారుమయ్యాయని వాపోతున్నారు. గ్రామా ల్లో రీసర్వే జరుగుతున్న విషయం కూడా రైతులకు తెలియకుండా ముగించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని రైతులు అనేకమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఎలా పరిష్కరించాలో తెలియటం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో 303 దరఖాస్తులు రాగా ఏడాది కాలానికి 132 పరిష్కరించారు. మరో 171 దరఖాస్తులు పరిష్కారం కాలేదు. శివరాంపురం గ్రామంలో అత్యధికంగా తప్పుల రికార్డుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని 119 దరఖాస్తులు రెవెన్యూ అధికారులకు అందజేశారు. వాటిలో జాయింట్ సర్వే తప్పులను మాత్రం దిద్దుబాటు చేయగా ఎల్‌పీఎం తప్పులను పరిష్కరించలేక పోతున్నారు. గతంలో పనిచేసిన అధికా



రుల తప్పిదాలవల్ల తమకు బ్యాంక్‌లో రుణాలు రీషెడ్యూల్ చేయటం లేదని, భూములను అమ్మకాలు, కొనుగోలు చేయాలన్నా కావటంలేదని, అధికారులు చేసిన తప్పిదాలకు తాము ఎందుకు ఇబ్బందులు పడాలని అధికారులను గ్రామ సభలో నిలదీయటం జరిగింది. ఆగ్రామానికి చెందిన కొందరు అప్పటి గ్రామ సర్వేయర్ సక్రమంగా పని చేయనందునే తమభూముల హక్కులు రీసర్వేలో తారుమారయ్యాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ సర్వేయర్ ఆధ్వర్యంలో పలువురు విచారించి వెళ్లారేగాని ఆసర్వేలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామంలోని రీసర్వేలోని తప్పులు దిద్దుబాటు జరగలేదని రైతులు వాపోతున్నారు. మాధవరం గ్రామంలో జరిగిన రీసర్వే తప్పులను సరిచేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అనేకమార్లు అధికారుల దృష్టికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అనేకమార్లు తీసుకెళ్లినా తప్పులు దిద్దుబాటు కావటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రీసర్వేల వల్ల గ్రామాల్లో తమ అనువంశిక ఆస్తులు, కొనుగోలు ఆస్తులు తప్పులుగా ఉన్నాయంటూ నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వీఆర్వోల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. రీసర్వే తప్పులను సరిదిద్దాలని భూహక్కుదారులు రెవెన్యూ సిబ్బందికి చేతులు తడుపుతున్నా పనులు మాత్రం కావటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు గైకొని రీసర్వే తప్పులను సరిదిద్ది తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

3.42 ఎకరాలు తొలగించారు

గతవైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో నాపట్టా భూమి 3.42 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. పూర్వికుల నుంచి సంక్రమించిన భూముల్లో సర్వే నెం.172లో 90 సెంట్ల భూమిలో 0.56సెంట్ల భూమి మాత్రమే రికార్డుల్లో ఉంది. తనకుగల 171/1 లో 1.70సెంట్లు, 164/12లో 54 సెంట్లు, 141/3లో 1.18 సెంట్లు కలిసి 3ఎకరాల 42 సెంట్లు భూమిరికార్డుల్లో కన్పించకుండా పోయింది. ఆభూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థం కావటం లేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఏమి చేయలేక పోతున్నారు.

- వద్దినేని శ్రీనివాసరావు శివరాంపురం

రీసర్వే తప్పిదాలవల్ల ఇబ్బందిగా ఉంది

నాఇద్దరు కుమారులు కండరాలవ్యాధితో బాధపడతున్నారు. చికిత్సనిమిత్తం డబ్బులు లేక పొలం అమ్మేందుకు వెళ్లిగా తన పేరున ఉన్న పొలం రికార్డులో కన్పించకుండా పోయింది. రెవెన్యూ అధికారులను అడుగగా గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తప్పులు దొర్లాయని చెప్పారు. కుమారులకు అత్యవసరంగా చికిత్సలు చేయించాల్సి ఉంది. తన పాస్‌బుక్‌లో ఖాతా నంబరు755లో 23/4లో0.17సెంట్లు, 23/5లో 0.35సెంట్లు, 14లో0.20సెంట్లు, 22/లో 0.28సెంట్లు 100/5 లో 0.13సెంట్లు కలిపి మొత్తం ఎకరా 13సెంట్లు ఆన్‌లైన్‌లో ఉంది. రీసర్వేలో తప్పిదం వల్ల కేవలం 0.32సెంట్లు మాత్రమే కన్పిస్తున్నది. మిగిలిన భూమి ఆన్‌లైన్‌లో లేకుంటే పొలం ఎలా అమ్ముకోవాలి, పిల్లలకు ఎలా చికిత్స చేయాలో అర్థం కావటంలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. పొలం అమ్ముదామనుకున్నా రీసర్వే వల్ల నాపేరున లేదు. రెవెన్యూ అధికారులు రీసర్వే వల్ల జరిగిన తప్పిదాలను పరిష్కరించాలి.

- కొడిమెల వెంకట్రావు, మాధవరం

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తూ రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం. జాయింట్ సర్వేలను త్వరితగతిన పరిష్కారం చేస్తున్నాం. రైతుల వద్ద నుంచి ఆధారాలు తీసుకుని రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తాం. ఎల్‌పీఎం రికార్డుల్లో నమోదయిన తప్పిదాలను రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళ్లి పరిష్కరిస్తున్నాం. రైతులు ఆందోళన చెందవద్దు. రీసర్వే తప్పిదాలపై దరఖాస్తులు అందజేస్తే పరిశీలించి తగు న్యాయం చేస్తాం.

- బీవీ రమణారావు తహసీల్దార్, తాళ్లూరు

రహదారి అద్దంలా.. మార్జిన్ అధ్వానంగా!

- చెన్నుపల్లి-అనంతవరం రోడ్డులో మార్జిన్ కష్టాలు
- వేమవరం-తాతపూడి మధ్య దారుణంగా ఉన్న మార్జిన్
- ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతేసంగతులు
- వర్షాలొస్తే పాట్లు పడుతున్న వాహనచోదకులు



రోడ్డు మార్జిన్ గోతులలో నిలిచిన వర్షపు నీరు

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే చెన్నుపల్లి-అనంతవరం రోడ్డు మార్జిన్ కష్టాలతో వాహనచోదకులను అవస్థలపాలు చేస్తోంది. రోడ్డు మాత్రం బాగున్నా మార్జిన్ మాత్రం గోతులతో నిండి ఉంది. దీంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని చెన్నుపల్లి అనంతవరం అర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న వేమవరం, మురికిపూడి, తాతపూడి గ్రామాల మధ్య తారు రోడ్డు బాగున్న సైడు మార్జిన్ మాత్రం అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది గ్రానైట్ వాహనాలు, నేషనల్ హైవేకు వెళుతుంటాయి. ఈ రహదారిని గతంలోనే కొంత భాగం డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయగా మరికొంత భాగంలో ఉన్న సింగిల్ రోడ్డుకు పూర్తిస్థాయిలో తారు వేశారు. రోడ్డు అభివృద్ధి పరిచినా మార్జిన్‌లను చేపట్టలేదు. దీంతో వాహనాలు రోడ్డు దిగితే దిగబడి పోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాలు రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లోడుతో వెళ్లే వాహనాలు సైడుకు దిగే వీలు లేకపోవటంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ రోడ్డులో కొందరు రైతులు తమ పంట పొలాల్లోని నల్ల మట్టిని రోడ్డు మార్జిన్‌లో కట్టలా వేయటంతో వర్షాలు కురిస్తే రోడ్డు మెత్త బురదమయం అవుతోంది. వేమవరం గ్రామంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వెళ్లే వాహనాలు ప్రతిరోజూ రోడ్డు మార్జిన్‌లో కురుకుపోతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే వేమవరం నుంచి తాతపూడి వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లను అభివృద్ధి పరచాలని వాహనదారులు కోరుతున్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మాచారి

పుస్తక నిర్వహణ సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు

చినగంజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ సంఘంలో డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన పుస్తకాల నిర్వహణ సక్రమంగా లేకుంటే గ్రామ సంఘాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పర్చూరు నియోజకవర్గ ఏరియా కో-ఆర్డినేటర్ లక్ష్మాచారి హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పుస్తక నిర్వహణపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మాచారి మాట్లాడుతూ పుస్తకాల నిర్వహణ అనేది డ్వాక్రా మహిళల ప్రగతికి గుండెకాయ లాంటిదన్నారు. ఇచ్చిన రుణాలను సక్రమంగా పుస్తక నిర్వహణ చేస్తే ఆర్థిక లావాదేవీల్లో తప్పులు లేకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంజీ. శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, సీసీలు వెంకటస్వామి, లక్ష్మి, మాధవి, వీవోఏలు పాల్గొన్నారు.

ముప్పవరంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక

పంగులూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముప్పవరం గ్రామంలో ఉపముఖ్యమంత్రి, జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు ఫణీంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో కేకు కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, జనసేన నాయకులు వెంకటేష్, భాను, వీరాంజనేయులు, కుక్కపల్లిఆంజనేయులు, గరిమిడి జగన్.పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

రైతులు పొగాకు సాగు చేయవద్దు

సంతమాగులూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) సంతమాగులూరు మండలంలో ఎక్కడా రైతులు పొగాకు సాగుచేయవద్దని ఏవో సైదా సూచించారు. మంగళవారం సజ్జాపురం గ్రామంలో ఆత్మ వారి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ మండలంలో ఎక్కడ రైతులు పొగాకు సాగు చేయకూడదన్నారు. పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న , జొన్న, చిరుధాన్యాలు సాగుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలమందారెడ్డి, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ ఎన్ అక్షరాణి మౌనిక, శేషు నందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలలో నిబంధనలు పాటించాలి

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు విక్రయాల్లో కచ్చితం గా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజ్యలక్ష్మీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాకును, రికార్డులు పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎరువులు బ్లాక్ మార్కెటింగ్ చేయకూడదు

మేదరమెట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు అందించాలని, ధరలు పెంచి బ్లాక్ మార్కెటింగ్ చేస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం మేదరమెట్లలోని ఎరువుల దుకాణాలను అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు ఎస్ఐ సురేష్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల బ్లాక్‌మార్కెట్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అహమ్మద్ పాల్గొన్నారు.

చేనేతల హామీలను నెరవేర్చాలి

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కమిటీ సమావేశం కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా, అమలు చేయకపోవడం అన్యాయమన్నారు.

మహిళా మార్ట్ మూత

(5వ పేజీ తరువాయి)

చేయించారు. దీంతో లాభాల బాటలోనే నడిచిన మార్ట్ ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోయింది. సొమ్ములు కూడా మాయం కావడంతో ఆర్పీలు తలపట్టుకు కూర్చున్నారు. మార్ట్ ప్రారంభం సమయంలో నాటి వైసీపీ ప్రభుత్వం ఆదేశాలంటూ ఖచ్చితంగా రూ. 1500 చెల్లించాల్సిందేనని వసూలు చేసిన ఆర్పీలు, ఆ తర్వాత సరుకులు కూడా కొనాల్సిందేనని పొదుపు సంఘాల సభ్యులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆర్పీల చొరవతో మార్ట్ లాభాల బాటలోనే నడిచినా, ప్రస్తుతం కనీసం కేజీ కందిపప్పు కూడా లేని దారుణ పరిస్థితిలో ఉంది. దీంతో లాభాలు, నిల్వ సరుకులు, నగదు ఏమయ్యాయి? అని పొదుపు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మార్ట్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆర్పీలు ఇప్పుడు సంఘాల సభ్యులకు ఏమి చెప్పాలో తెలియక బిక్కమొహం వేస్తున్నారు.

సరుకులు... సొమ్ము రెండూ మాయం..!

జిల్లాలో 'జగనన్న మహిళా మార్ట్'లను 2023 సెప్టెంబరు 23న ప్రారంభించారు. ఒంగోలులో మార్ట్‌ను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సుమారు రూ.50 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాదికి రూ.6లక్షల వరకు ఆదాయం రాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.28లక్షలు లాభాల్లో ఉంది. వాటితోపాటు నిత్యావసర సరుకులు స్టాక్ రూ.25లక్షల వరకూ ఉండింది. ఫర్నిచర్ విలువ మరో రూ.15లక్షల వరకూ ఉంటుంది. గతేడాది డిసెంబరు వరకు లాభాల బాటలోనే నడిచిన మార్ట్ ఈ ఏడాది జనవరి నుంచి మార్టులో సరుకులు.. సొమ్ము మాయమయ్యాయి. అయితే మెప్మా ఉన్నతాధికారులకు ఈ వ్యవహారం అంతా తెలిసినా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. అయితే తాము చెల్లించిన సొమ్ము ఏమైంది? వాటిని ఎవరు తిరిగి చెల్లిస్తారు? మార్ట్ మూతకు ఎవరు బాధ్యులు? అన్న ఆందోళన సంఘ సభ్యుల్లో కనిపిస్తోంది.

గురువా.. స్పందనేది!

(5వ పేజీ తరువాయి)

ప్రకటన విడుదల చేసి 23 నాటికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఒకరోజు సమయంలో అన్ని సమకూర్చుకోలేక కొందరు టీచర్లు మానుకున్నట్లు తెలుస్తోంది.

నలుగురే హెచ్‌ఎంలు దరఖాస్తు

జిల్లాస్థాయిలో పది మంది ప్రధానోపాధ్యాయులు, 20మంది స్కూలు అసిస్టెంట్లు, 30 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే హెచ్‌ఎంల నుంచి కేవలం నాలుగు, ఎస్‌జీటీల నుంచి 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. స్కూలు అసిస్టెంట్ల నుంచి 33 దరఖాస్తులు అందాయి. జిల్లాస్థాయి కమిటీ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం కూడా దరఖాస్తుకు అవకాశం ఇచ్చారు.

గురుపూజోత్సవ ఏర్పాట్లకు కమిటీలు

ఈనెల 5న నిర్వహించనున్న గురుపూజోత్సవం సందర్భంగా టీచర్లకు జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవ ఏర్పాట్లకు 46 మందితో మూడు కమిటీలను నియమించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 15 మంది ఎంఈవోలు, హెచ్‌ఎంలతో ఆహ్వాన కమిటీ, 20 మంది స్కూలు అసిస్టెంట్లతో కార్యనిర్వాహక కమిటీ, 11 మంది ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో క్రమశిక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవ ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ కమిటీల్లోని సభ్యులతో బుధవారం స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.

అరుణ దందాలపై పోలీసుల ఆరా

(5వ పేజీ తరువాయి)

పార్టీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నెల్లూరు జిల్లాకు చెందిన నరహంతక ముఠా పాల్గొంది. ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు వ్యక్తులు నెల్లూరు జిల్లాకు చెందిన వారుగా పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరిలో అత్యంత కసిగా వీరయ్యచౌదరిని కత్తితో పొడిచినట్లు పోలీసులు చెబుతున్న వంశీకి అరుణ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్లు వెల్లడైంది. శ్రీకాంత్ పెరోల్ కోసం ప్రయత్నించిన అరుణకు అనేక మంది రౌడీషీటర్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. శ్రీకాంత్ ముఖ్య అనుచరుడు జగదీష్‌తో వంశీకి సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. అంతేకాదు జగదీష్ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. వంశీకి కూడా నేరచరిత్ర ఉన్నట్లు గతంలోనే గుర్తించారు. తాజాగా అరుణ గ్యాంగ్‌తో వీరయ్యచౌదరి కేసు హంతకులకు ఉన్న సంబంధాలపై జిల్లా పోలీసులు ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా అరుణ జిల్లాలో ఎక్కడైనా దందాలకు పాల్పడిందా? అనే అంశంపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో వస్రాంనాయక్

మార్టూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యాశాఖ కార్యాలయం నందు మంగళవారం భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేయుచున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. యంఈవో వస్రాంనాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెండవ యంఈవో కె ప్రేమలత,భవిత కేంద్రం నిర్వాహకులు సిహెచ్ నాగకుమారి,షేక్ ఆయేషా పర్వీన్,సిఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటరుకు బీరువా బహూకరణ

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): యద్దనపూడిలోని భవిత సెంటరుకు మంగళవారం ఐవైస్ రక్షక వెల్ఫేర్ ట్రస్ట్ అద్దంకి వారు బీరువాను బహూకరించారు. అంతేగాకుండా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను కూడా ట్రస్ట్ వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపీ, ట్రస్ట్ సభ్యులు ఖాసిం, దుర్గాప్రసాద్, ఆర్ సురేఖ, విజయగీతిక తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మార్టూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనపై దాడిచేసి కొట్టాడని మార్టూరులోని పడమర బజారుకు చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ బుల్లోడు అదేకాలనీకి చెందిన మర్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం పడమర బజారులో జరుగుతున్న వినాయకుని ఊరేగింపు కార్యక్రమం చేస్తూ ఉండగా,అనిల్ కుమార్ యాదవ్ తనను దాడిచేసి కొట్టాడని వెంకటేశ్వర్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యం శేషగిరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త ఆమె కుటుంబ సభ్యులు శారీరికంగా మానసికంగా వేధిస్తున్నారని, దుడ్డు హెమీయా ఇచ్చిన ఫిర్యాదు మార్టూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన దుడ్డు సతీష్ 9 నెలలు క్రితం కారంచేడు మండలంలోని జరుబులవారిపాలేనికి చెందిన హెమీమాను వివాహం చేసుకున్నారు..అయితే వివాహం జరిగిన మూడు నెలలు తర్వాత హెమీమాను భర్తతో పాటు అత్తామామలు శారీరకంగా, మానసికంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఈ విషయమై గత నెల 30న హెమీమా అన్నయ్య, అమ్మమ్మ, తాతయ్యలు చిమ్మిరిబండ గ్రామానికి వచ్చి సతీష్ కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి ప్రయత్నించారు. అయితే వారు హెమీమాను, ఆమె తరఫున వచ్చిన వారిపై దాడి చేసి గాయపరచారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

- కోర్టు ఆవరణలో ఘటన

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయం కావాలంటూ కోర్టు ఆవరణలో భార్యాభర్తలిద్దరూ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గిద్దలూరులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం కేఎస్‌పల్లె పంచాయతీ పరిధిలోని అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిలక పిచ్చిరెడ్డి, భార్య నాగమణి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల వినాయకచవితి నిమజ్జనం సందర్భంగా తన కుమారుడైన రాజేష్‌రెడ్డిని కొందరు మద్యానికి బానిస చేసి తమను ఇబ్బందిపెడుతున్నారని కొందరిపై ఆరోపణలు చేయడంతో పాటు దుర్భాషలాడారు. ఈ విషయమై గ్రామానికి చెందిన వారు పిచ్చిరెడ్డిపై దాడి చేశారు. దీంతో పిచ్చిరెడ్డి, భార్య నాగమణి మంగళవారం గిద్దలూరు కోర్టులో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ ఎవరూ తనకు సహకరించలేదని మనస్తాపానికి గురైన భార్యాభర్తలిద్దరూ తాగారు. ఇది గమనించిన అక్కడి వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. పిచ్చిరెడ్డిపై దాడిచేసిన నర్రా కల్యాణి, నర్రా గిరిజ, నర్రా లక్ష్మీదేవి, నర్రా రంగస్వామిరెడ్డి, నర్రా శేఖర్‌రెడ్డిపై, అలాగే పిచ్చిరెడ్డి కూడా దుర్భాషలాడారనే అంశాలపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు.

ఆరోగ్యరంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మార్కాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యరంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జార్జి ఫార్మసీ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కాలేజీ ఆధ్వర్యంలో క్వాలిటీ అండ్ సేఫ్టీ ఇన్ హెల్త్ కేర్ అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్‌లో పలువురు విదేశీ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ రోగి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఆరోగ్యవేత్త ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ వెబినార్‌లో యూకే నుంచి ఎమినెంట్ స్పీకర్ డాక్టర్ సంజయ్ ధాంకింగ్, డాక్టర్ అబూ అలీమ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోకన్వీనర్ డాక్టర్ వై.సునీత, డాక్టర్ కె.అశోక్ బాబు, ఐసీఏసీ కో ఆర్డినేటర్ సయ్యద్ ముజీబ్‌తో పాటు సుమారు 400 మంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలకు పూర్తిస్థాయి టీచర్లు

ఒంగోలువిద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు పూర్తిస్థాయిలో టీచర్లను ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల్లో సాంకేతిక కారణాల వల్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని ఎస్‌జీటీ పోస్టులు ఓపెన్ కాలేదు. దీంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో రెగ్యులర్ టీచర్లు లేరు. ప్రస్తుత మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడెక్కడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయో వాటిని పరిశీలించి డీఎస్సీ కొత్త టీచర్లతో భర్తీ చేస్తామన్నారు. ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలు మెగా డీఎస్సీ నియామకాలకు ముందే పూర్తి చేయనున్నట్లు విజయరామరాజు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలల్లో కోరుకోని... రిలీవర్ రాని కారణంగా అదే పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రిలీవ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల వినతులను పరిశీలించి న్యాయసమ్మతమైన వాటిని పరిష్కరిస్తామని కమిషనర్ వెబెక్స్ సమావేశంలో తెలిపారు.

తడి, పొడిచెత్తను వేరు చేయాలి

- ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు

సింగరాయకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలో మంగళవారం ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు పర్యటించారు. చెత్తసేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి వాహనాల్లో వేయాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఇంటి యాజమాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొలతలు తీయాలని అధికారులకు సూచించారు. తదనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. మూలగుంటపాడు, సింగరాయకొండ మేజర్ పంచాయతీల్లో ఇంటి పన్నులు పూర్తిగా వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో రమేష్‌బాబుకు సూచించారు.

జరుగుమల్లి, వావిలేటిపాడుల్లో..

జరుగుమల్లి (కొండపి) : : జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల్లో చెత్త సేకరణను మంగళవారం ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు.

రూ.10 కోట్లు నరేగా నిధులు విడుదల

● రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పెండింగ్‌లో ఉన్న పది కోట్ల నరేగా నిధులు ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో నిధులు పనులు చేసిన వారి ఖాతాలకు జమ అవుతాయన్నారు. గత ప్రభుత్వం కక్షతో పనులు చేసిన వారికి నిధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ నిధులు చెల్లిస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో రూ.170 కోట్ల నరేగా నిధులతో అభివృద్ధి పనులు చేసిందన్నారు. పంచాయతీరాజ్‌లో రూ.140 కోట్లతో సీసీరోడ్లు, బీటీరోడ్లు నిర్మించామన్నారు.

పొగాకు నారుమళ్ల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

● పొదిలి వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్



సలకనూతల గ్రామంలో పొగ నారును పరిశీలిస్తున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్‌సీవీ (ఫ్లూ క్యూరెడ్ వర్జీనియా) పొగాకు నారుమడులు పెంపకం చేసే యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని పొదిలి వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సలకనూతల గ్రామంలో ఏర్పాటు చేసిన నారుమళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ నీటి వనరులున్న నేలల్లో మాత్రమే పెంపకం చేపట్టాలన్నారు. నారుమళ్లకు మధ్యలో సుమారు 30 సెంటీ మీటర్ల వెడల్పు ఉండాలన్నారు. 10 మీటర్ల వెడల్పుగల నారుమడిలో ముందుగా 50 గ్రాములు అమ్మోనియం సల్ఫేట్, 50గ్రాములు పొటాషియం సల్ఫేట్, 100గ్రాముల డోలామైట్ వేయాలని సూచించారు. ముందుగా నత్రజని వేయకూడదన్నారు. నారు మొలకెత్తిన వారంరోజుల నుంచి ఐదురోజుల వ్యవధిలో రెండసార్లు 50గ్రాములు అమ్మోనియం సల్ఫేట్, 25గ్రాముల పొటాషియం సల్ఫేట్ వేయాలని సూచించారు. పెరుగుదలను బట్టి ఎరువులు వాడాలన్నారు. పొగాకునారు పెంచే యజమానులు పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని గిరిరాజ్‌కుమార్ తెలిపారు. అనంతరం సీటీఆర్‌ఐ సంస్థ విత్తనాలు సరఫరా చేస్తుందన్నారు. రెండు హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే నారు అమ్మాలని ఆదేశించారు.

పత్తిపై 11శాతం దిగుమతి సుంకం రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను రద్దు చేయాలని డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పత్తిపై 11 శాతం దిగుమతి పన్ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. సంయుక్తకిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి, జయంతిబాబు అధ్యక్షత వహించారు. ధర్నాలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు క్రమబద్ధంగా ద్రోహం చేస్తోందని ఆరోపించారు. పత్తిపై దిగుమతి పన్ను తొలగించడం వల్ల ఆరు కోట్ల మంది పత్తి రైతుల కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీఆర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల రుణాలు రూ.2 లక్షల కోట్లు ఉంటాయన్నారు. అయితే రైతుల రుణాలు మాఫీ చేస్తే బ్యాంకులు దివాళా తీస్తాయని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి మాట్లాడటం హస్యాస్పదంగా ఉందన్నారు. అఖిలభారత రైతుకూలీ సంఘం నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరకు చట్టపరమైన హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ 2014 నుంచి రైతు ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలను ప్రత్యేక ఉపశమన ప్యాకేజీ ద్వారా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

● ఒంగోలులో పలు సేవా కార్యక్రమాలు



వైసీపీ ఆఫీసులో మాజీసీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చిసెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్నలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే ఉన్న జాన్‌వెస్లీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం నగరంలో ఉన్న వైఎస్ విగ్రహాలతోపాటు పార్టీ కార్యాలయంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కళా ఉత్సవం.. భళా..!

● ఘనంగా జెఎన్‌వీ రీజినల్ కళా ప్రదర్శనలు

● సృజనాత్మకతను చాటిన విద్యార్థులు





జవహర్ నవోదయ విద్యార్థుల కళాఉత్సవాలు కనుల పండువలా సాగాయి. భారత ప్రభుత్వం ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ 2047' పేరుతో ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న ఈ కళా ప్రదర్శనలకు ఒంగోలు వేదికైంది. జెఎన్‌వీ హైదరాబాద్ రీజినల్ పరిధిలోని నాలుగు క్లస్టర్స్ పరిధిలో గల జవహర్ నవోదయ విద్యార్థుల ప్రదర్శనలు, ఆకట్టుకున్నాయి. ఈనెల 2, 3 తేదీల్లో ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేయగా మంగళవారం రిమ్స్ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాలలోని పలు జెఎన్‌వీ విద్యాయలయాల నుంచి సుమారు 164 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 9,1,11 తరగతుల విద్యార్థులు పాల్గొని, తమలో దాగి వున్న కళారూపాలను ప్రదర్శించారు. కథలు, ఫోక్ డ్యాన్స్‌లు, సంగీతం ప్రదర్శనలు సోలో.. గ్రూప్‌ల విభాగాలలో నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమంలో విద్యార్థులు, తమ ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమానికి హైదరాబాదు జేఎన్‌వీ అసిస్టెంట్ చైర్మన్ చక్రపాణి అధ్యక్షత వహించగా, ఒంగోలు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ శివరామ్, ఖమ్మం ప్రిన్సిపాల్ వెంకటాచలం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామిరెడ్డి, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభాకర్ రెడ్డి, బెంగుకూరు నవోదయ ప్రిన్సిపాల్ ప్రహల్లాద్ పలువురు పాల్గొన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

తెల్ల పేపర్లపై ఓపీలు.. నోట్సులే కేసు షీట్లు

● కొండపి సీహెచ్‌సీ దుస్థితి ఇదీ..



రోగి తెచ్చుకున్న నోటు పుస్తకం

కొండపి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండపి సీహెచ్‌సీలో కనీసం ఓపీ రాసేందుకు ముద్రించిన కాగితాలు లేని దుస్థితి నెలకొన్నది. వైద్యశాలకు వచ్చే రోగులకు ఓపీ రాయడానికి తెల్లకాగితం తెచ్చుకోమని ఇక్కడి వైద్య సిబ్బంది అంటున్నారు. పదేపదే దీర్ఘకాలంగా వచ్చే రోగులను పది రూపాయల నోట్సులు కొనుక్కుని రమ్మంటున్నారు. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులు బుక్ షాపుల్లో తెల్లకాగితాలు, నోట్సులు కొనుక్కుని సీహెచ్‌సీకి వస్తున్నారు. చిన్నారులు బడికి పోయినట్లు వైద్యశాలకు నోటు పుస్తకాలు చేతబట్టుకుని రోగులు వైద్యశాలకు వస్తున్నారు. ఈ నోట్సులో వైద్య సిబ్బంది వివరాలు నమోదు చేస్తున్నారు. వైద్యులు రోగులు తెచ్చిన పల్చటి కాగితాలపై స్పీడుగా ప్రిస్క్రిప్షన్ రాస్తుంటే అవి చిరిగిపోతున్నాయి. నిజంగా ఓపీ రాసేందుకు ఈ వైద్యశాలలో ముద్రించిన కాగితాలు లేకపోవడం దారుణమని రోగులు వాపోతున్నారు. పది రూపాయలతో నోట్సులు కొనుక్కుని తెచ్చుకోమంటున్నారని, దీంతో కొని తెచ్చుకుంటున్నామని మంగళవారం వైద్యశాలకు వెళ్లిన ఆంధ్రజ్యోతికి పలువురు రోగులు తెలిపారు. ఈ విషయమై సీహెచ్‌సీ డీసీఎస్ కుంభా నాగమణిని వివరణ అడగ్గా ప్రభుత్వం కంప్యూటర్ ద్వారా రోగుల సమాచారాన్ని నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇందులో భాగంగా వైద్యశాలలో 8 కంప్యూటర్లు వచ్చాయని, వాటిలో రోగుల వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. అందుకే ఓపీ చీటీలు తీసేశామని, రాష్ట్రం అంతా ఇదే విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. రోగి పూర్వపు వివరాలు డ్యూటీలో ఉన్న డాక్టరు తెలుసుకునేందుకు మాత్రమే రోగులను నోట్సులు తెచ్చుకోమంటున్నామని అందులో వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్లు ఇచ్చారు... ట్రక్కులు మరిచారు!

● స్వచ్ఛాంధ్రలో పంచాయతీలకు 3 నెలల క్రితం పంపిణీ

● రిబ్బన్‌లు కూడా ఊడదీయకుండా వదిలివేత



కొండపి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అనేక గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం ట్రాక్టర్లను ఉచితంగా మూడు నెలల క్రితం అందజేసింది. కొండపి నియోజకవర్గంలో ఆరు మండలాల్లోని పలు గ్రామ పంచాయతీలకు దాదాపు 20 ట్రాక్టర్లు అందజేసింది. అయితే చెత్త సేకరణకు ట్రాక్టర్‌లను మాత్రమే ఇచ్చింది. ఇంజన్ ఇచ్చి ట్రక్కులు ఇవ్వకపోవడంతో పలు గ్రామ పంచాయతీల్లో ఇంజన్‌లు ఖాళీగా ఉన్నాయి. పంపిణీ రోజు కట్టిన రిబ్బన్‌లను కూడా తీసేయలేదు. ఓ గ్రామ పంచాయతీ వారిని అడగ్గా ట్రాక్టర్ మరీ కదిలించకపోతే బ్యాటరీ దిగిపోతుందని, అప్పుడప్పుడూ ముందుకు, వెనుకకు ఇంజన్‌ను కదిలిస్తున్నామని గ్రామ సర్పంచ్ తెలిపారు. ట్రాక్టర్‌లు అలంకార ప్రాయంగా ఉండటంతో పారిశుధ్య కార్మికులు ఎప్పటిలాగే చెత్త రిక్షాల్లో చెత్తను సేకరించి సంపద కేంద్రాల వద్దకు తీసుకెళ్లిపోస్తున్నారు. ట్రాక్టర్ల వినియోగంలోకి వస్తే చెత్త సేకరణ సులువుగా ఉంటుందని పారిశుధ్య కార్మికులు తెలిపారు. కొండపి మండలంలోని పెట్లూరు, కె.ఉప్పలపాడు, ఇలవర (నేతివారిపాలెం) గ్రామాలకు ఇచ్చారు. జరుగుమల్లి మండలంలోని కామేపల్లిలో ట్రాక్టర్ మూలన పడేశారు. ట్రాక్టర్ ఇంజన్ ఇచ్చారు. ట్రక్కు ఇవ్వలేదు. ట్రక్కును బాడుగకు, లేదా దాతల సాయంతో సమకూర్చుకున్నా, డ్రైవర్ సమస్య వస్తున్నదని పలు గ్రామ పంచాయతీల అధికారులు తెలిపారు.

జనావాసంలోకి నల్లమల రారాజు

పులుల సంతతి గణనీయంగా పెరగడమే కారణమా?



కంభం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జంతువు.. నల్లమల అడవి రారాజు పెద్దపులి అభయారణ్యం వీడి ఇటీవల జనావాసాల మధ్యకు వస్తోంది. పులుల సంతతి పెరగడం, ఆహారం కోసం తిరగడంలో భాగంగానే గ్రామాల్లోకి వస్తోందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఫారెస్ట్ అధికారుల గణాంకాల ప్రకారం 2014లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 70పులులు ఉండగా, 2024లో అవి 80కి పైగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఏడాది సాధారణ గణన చేపట్టగా 87కి పెరిగినట్లు భావిస్తున్నారు. పులుల సంఖ్య పెరగడం, పులులు పెరిగి పెద్దవైన తర్వాత ఒంటరిగా తిరిగే అలవాటు ఉంది కావున అవి అడవిలో చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో వాటి ఆవాస జోనుగా ఏర్పాటు చేసుకుంటాయి. అందులో భాగంగానే పెద్ద పులులు ఆహార అన్వేషణ కోసం, సంతానోత్పత్తి కోసం తిరిగే క్రమంలో అవి గ్రామాల వైపు వచ్చి వెళ్తుంటాయి. ఇటీవల ఓ పెద్దపులి చిత్తూరు జిల్లాలోని శేషాచలం అడవుల వైపు కూడా వెళ్లిన ఉదంతాన్ని వారు చెప్తున్నారు. అలా పులులు ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ ఉంటాయని తెలిసింది. ఇలా పెద్దపులులు ఒక రోజుకు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తుంటాయని ఈ క్రమంలో గ్రామ ప్రాంతాలకు వచ్చిన పులులు తమ ఆహారంలో భాగంగా పశువులపై దాడి చేసి చంపిన క్రమంలో పెద్దపులి దాడిలో అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. అడవుల్లో కెమెరాలను ఏర్పాటు చేసిన ప్రాంతాలకు వెళ్లిన జంతువుల ఫొటోలు తీస్తాయని కెమెరాలకు చిక్కిన ఫొటోల ఆధారంగా పులుల వంటిపై చారలు, పాదముద్రల ద్వారా పులుల సంఖ్యను లెక్కిస్తామని అధికారులు వివరిస్తున్నారు.

పులల సంరక్షణ అందరి బాధ్యత

అడవుల్లో ప్రకృతి సమతుల్యతను కాపాడే పెద్దపులుల సంరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పెద్ద పులుల సంరక్షణకు తాము అన్ని రకాల పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మార్కాపురం డివిజన్‌లోని అటవీ ప్రాంత పరిధిలో రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పెద్దపులులు పడకుండా, ప్రమాదాలబారిన పడిన పెద్ద పులులను రక్షిస్తారని తెలిపారు. పెద్దపులి పర్యావరణ నేస్తమని కావున పెద్ద పులులను కాపాడుకోవాలని తెలిపారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివాసముండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులులకు ఎటువంటి హాని తలపెట్టవద్దని కోరారు.

- ఎం.ప్రసాద రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

● బాపూజీ కాంప్లెక్స్ వద్ద కేక్ కట్‌చేసిన జనార్దన్, రియాజ్

● సేవా కార్యక్రమాలు నిర్వహించిన జనసైనికులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఒంగోలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీనాయకులు, జనసైనికులు, వీర మహిళలు భారీగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, ఆ పార్టీ నాయకుడు కంది రవిశంకర్ పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే దామచర్లతో కలిసి కేక్ కట్ చేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకు ముందు మంగమ్మ కళాశాల వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వీరమహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నెహ్రూనగర్‌లో జెండా ఆవిష్కరణతో పాటు కేక్‌ను కట్ చేయగా రిమ్స్ హాస్పిటల్‌లో ఆ పార్టీ నాయకుడు కిషోర్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సీతారాంపురంలోని వృద్ధాశ్రమంలో అంకబాబు ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు పేస్ కాలేజీలో పవన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, బ్రహ్మయ్య, దండే సతీష్, పెంట్యాల అంకారావు, గోవింద్ కోమలి, బండారు శేషగిరి, ఆగిరం సురేష్, వినోద్, ఉంగరాల మోహన్, నరసింహారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

పొదిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలను అమలు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవులయ్య కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీవోహోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ బిల్డింగ్ ఇతర కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పిలుపు మేరకు ఈనెల 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయం ముట్టడిని భవన నిర్మాణ కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ద్వారా అమలవుతున్న పథకాల మెమో 1214ని నిలిపివేసిందన్నారు. రూ.వేల కోట్ల కార్మిక సంక్షేమ నిధులున్నా వైసీపీ తీసుకున్న నిర్ణయంతో సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.రోశయ్య, నాయకులు అన్వర్, నాగూర్, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

5న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

సింగరాయకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : టెన్నికాయిట్ అండర్-18 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక ఈనెల 5న స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంపికైన జట్లు ఈ నెల 13,14 తేదీల్లో కోనసీమ జిల్లాలోని మండపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాల కోసం సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ కె.శంకర్‌రావు (సెల్ నంబర్ : 9848125706)ను సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిల్వలు ఉంటే చర్యలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఎరువుల అక్రమ నిల్వలు ఉన్నా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మంగళవారం సంతనూతలపాడులోని చంద్ర ఫెర్టిలైజర్స్, మన గ్రోమోర్ దుకాణాలపై సీఐ తనిఖీలు చేశారు. రికార్డులకు, నిల్వలకు సరిపోలాయో, లేవో పరిశీలించారు.

ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జి ఎస్సైగా సైదులు

సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్సైగా మద్దిపాడు ఎస్సై జి.వెంకటసైదులను ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. ఎస్సై అజయ్‌బాబు 15 రోజులు సెలవుపై వెళ్లారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ సుబ్బారావు, ఏవో భాస్కర్‌లు ఐదు దుకాణాల్లో యూరియాతో పాటు ఎరువుల నిల్వలను పరిశీలించారు.

ఎన్‌జీపాడులో...

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోని మనగ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఎస్సై రజియా సుల్తానా మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు.

శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బాల సంస్కార్ కేంద్రాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పురోభివృద్ధికి డాక్టర్ చాపల వంశీకృష్ణ దంపతులు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఎంఈవో కిషోర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సత్యనారాయణపురం, ఇస్లాంపేట, ప్రకాశం కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఈ కేంద్రాలలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం పూట ట్యూషన్లు చెప్పే విధంగా అనుభవజ్ఞులైన టీచర్లను నియమించడంతోపాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి డాక్టర్ వంశీకృష్ణ సొంత నిధులు వెచ్చించడం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ వైద్య రంగంలోనే కాకుండా సమాజ సేవలో తమవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చాపల శాంత కుమారి, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, ఖాశింసైదా, అనిల్, గోపి, హెచ్ఎంలు హేమలత, పుష్పలత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆరోగ్య భరోసా

ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తోందని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 107 మంది లబ్ధిదారులకు 88లక్షల 38 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ అనారోగ్య సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి కార్పొరేట్ వైద్యం అందించడం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సీఎంఆర్‌ఎఫ్ సహకారంతో మెరుగైన వైద్యం పొంది ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే జనార్దన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జనసేన జిల్లా నాయకులు కంది రవిశంకర్, నగర టీడీపీ అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.



లబ్ధిదారునికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

క్విస్‌లో సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ఒంగోలు విద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సైబర్ క్రైం మాజీ చీఫ్ కౌన్సిలర్ కే ప్రదీప్, బాపట్ల జిల్లా సైబర్ క్రైమ్ చీఫ్ కౌన్సిలర్లు విద్యార్థులకు సైబర్ మోసాలపై వివరించారు. వాట్సాప్ ఇన్ఫో, బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ డేటా తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళాశాల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు తదితరులు ఉన్నారు.

రక్తదానం చేసిన యువకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అన్నవరప్పాడులోని పార్కు వద్ద వినాయక చవితి 13వ వార్షికోత్సవం సందర్భంగా యువకులు రక్తదానం చేశారు. సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు, రెడ్‌క్రాస్ డాక్టర్ జాగర్లమూడి కృష్ణ, సంస్థ ప్రతినిధులు కోసూరి శ్రీదేవి, వడ్డెంపూడి సుజాతరావు పాల్గొన్నారు.

నక్కల, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్లమీదనే జీవనం సాగిస్తున్న నక్కలు, గిరిజనులకు సొంతిళ్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్‌చేశారు. నక్కల గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ రాణెమ్మ అధ్యక్షత వహించారు. ధర్నాలో గిరిజన ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలో కొత్తకూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుమీదనే దుర్భరమైన జీవితాలను గడుపుతున్న నక్కల, గిరిజనుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. సుమారు 70 కుటుంబాలకు పైగా అక్కడ జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి టి. వెంకటస్వామి, కుల రచయితల సంఘం రాష్ట్ర కన్వీనర పిన్నిక శ్రీనివాస్, నక్కల గిరిజన నాయకులు జెమిని, రాజు, రవి పాల్గొన్నారు.

మురుగు పారుదలకు చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మురుగునీరు పారుదల వ్యవస్థకు మెరుగైన చర్యలు చేపట్టినట్లు కమిషనరు వెంకటేశ్వరరావు చెప్పారు.మంగళవారం పోతురాజు కాలువ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, పేర్నమిట్ట పాలకేంద్రం వద్ద నుంచి రాజీవ్‌కాలనీ వరకు రాజపానగల్ రోడ్, జయరాం సెంటర్, భాగ్యనగర్ 5వలైను, జీజీహెచ్ వద్ద పులివెంకట రెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, కొప్పోలు తదితర ప్రాంతాలలో పూడిక తీత, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ స్ప్రేపనులు చేపట్టారు.

పొగ నారుమళ్ల రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు(రూరల్)సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నారు మడులు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఒంగోలు పొగాకు బోర్డు వేలం కేంద్రం 2లో పేర్లు నమోదు చేసుకోవాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి స్పష్టం చేశారు. కేశినేనివారిపాలెంలో సాగు చేసిన పొగాకు నారుమడులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు, వ్యాపారులు తప్పనిసరిగా నారుమళ్లు దగ్గర పొగాకు బోర్డు అనుమతి బోర్డు తప్పనిసరిగా పెట్టాలన్నారు. గరిష్ఠంగా రెండు హెక్టార్ల వరకు అనుమతి తీసుకొని సాగు చేసుకోవచ్చునని చెప్పారు. పొగనారు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదు పొందాలని, దానిని తప్పనిసరిగా వేలం కేంద్రంలో సమర్పించాలని తెలిపారు. అవకాశం ఉన్న రైతులు తప్పనిసరిగా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాదు, బండారు రామాంజనేయులు, పొగాకు బోర్డు వేలం కేంద్ర క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చవితి ఉత్సవాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలు మంగళవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పూజలు చేశారు. బాలాజీ నగర్, బాపూజి కాంప్లెక్స్, పోకలవారి వీధి, గాయత్రీ మందిరం వద్ద జడ్పీ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద దామచర్ల పూజలుచేశారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన ఉత్సవాలు వైభవంగా సాగాయి.

వైభవంగా గ్రామోత్సవం

కొండపి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇలవర (నేతివారి పాలెం) గ్రామంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది డప్పు కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. వినాయకుడికి మహిళలు వార్లు పోసి, టెంకాయలు కొట్టి పూజలు చేశారు. బుధవారం విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించనున్నారు.

పేర్నమిట్టలో స్థలం సరిహద్దుల వివాదం

సంతనూతలపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేర్నమిట్టలో సర్వేనెంబరు 452/19, 28/1ఏలలో సరిహద్దుకు సంబంధించి వివాదం చోటుచేసుకుంది. మంగళవారం 28/1ఏ సర్వేనెంబరుకు చెందిన యజమానులను తీసుకుని మండల సర్వేయరు రాజేష్ సర్వే చేసేందుకు సదరు స్థలం వద్దకు వచ్చాడు. విషయం తెలుసుకున్న 452/19కి చెందిన వ్యక్తులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వివాదంలో ఉన్న స్థలం సర్వేచేయడం ఏంటని, నిబంధనల ప్రకారం మీరు నడుచుకోవాలని, ఎటువంటి నోటీసులు లేకుండా ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. దీనిపై మండల సర్వేయరు రాజేష్‌ను వివరణ కోరగా తాము ఎవరి స్థలం ఎంత ఉందో హద్దురాళ్లు వేసేందుకు వచ్చానని, సర్వే కొలతలు చేపడితే చుట్టుపక్కల హద్దుల్లో ఉన్న స్థల యజమానులకు నోటీసులు ఇచ్చిన తర్వాతే సర్వేచేపడతామని చెప్పారు.

దివంగత వైఎస్సార్‌కు నివాళి

పొన్నలూరు, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం పొన్నలూరులో నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు, వైసీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి,

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు, సెప్టెంబరు 2 : సంతనూతలపాడులో దివంగతనేత వైఎస్సార్ 16 వవర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున.. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు డి.రమణమ్మ, ఎంపీపీ బి.విజయ నాయకులు డి.యలమందారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

అవీఇవీ



కేక్‌ను కట్‌చేస్తున్న పీడీ జోసెఫ్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పీడీ జోసెఫ్‌కుమార్ కేక్‌కట్ చేశారు. జిల్లా కాపుసంఘం కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, నరహరి సాంబయ్య, ఉమ్మడిశెట్టి శ్రీనివసారావు, అయినాబత్తిన గోపికృష్ణ, మేకల నారాయణ, జేష్ట ప్రసద్, పాపారావు, నారపశెట్టి రామ్మోహన్, బెల్లంకొండ సురేష్ ఉన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్...

సంతనూతలపాడు, సెప్టెంబరు 2 : పేర్నమిట్టలోని పాలకేంద్రం సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి పాదాల వద్ద జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, నియోజకవర్గ జనసేనా సమన్వయకర్త కందు కూరిబాబులు కేక్‌కట్ చేశారు. అనంతరం అంగనవాడీలోని చిన్నారులకు బేబిచైర్లను అందించారు. అనంతరం అన్నదానం చేశారు.

టంగుటూరులో...



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు కొణిజేడులో నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. జనసేన నాయకులు సాగినేని మురళి, సాగినేని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రామా గోపి, రామా శ్రీను, రామా సీతారామయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ తనిఖీ

గిద్దలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కోటగడ్డవీధి, షాదీ ఖానా బజారు, ముత్రాసువీధి, పోలీసు స్టేషన్ రోడ్డు, ఖాన్‌బజారు, అనూష పాఠశాల వీధుల్లో కమిషనర్ రమణ బాబు ఆకస్మికంగా పర్యటించారు. దోమల ఉధృతిని గమనించి యాంటీ లార్వా కెమికల్‌ను మురికినీటి కాలువల్లో స్ప్రే చేయాలని ఆదేశించారు. ఇళ్ల పరిస రాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజ లకు సూచించారు. విద్యుత్ శాఖ కార్యా లయం సమీపంలో నూతనంగా చేస్తున్న బోర్ డ్రిల్లింగ్ పనులను పరిశీలించారు. కమీషనర్ వెంట ఏఈ ఫోర్సియా, శాని టేషన్ కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, సచి వాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి) : వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ తేదీ మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలి పివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ శేషగిరిరావు ఒక ప్రకట నలో పేర్కొన్నారు. సాంకేతిక మరమ త్తుల కారణంగా నల్లగట్ల, బయనపల్లి, కొంగళవీడు, బ్రాహ్మణపల్లి, మోడంపల్లి, మిట్టమీదిపల్లి గ్రామాలలో విద్యుత్ సర ఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

రూ.1.85లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత


గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై సాంబశివయ్య, ఏవో లక్ష్మీనారాయణ

పెద్దారవీడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సాంబశివయ్య, ఏవో లక్ష్మీ నారాయణలు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళ వారం మండలంలోని కుంటలోని నాలుగు ఎరువుల దుకాణాలు, గొబ్బూరులోని రెండు దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు అమ్మవద్దని, పంట సాగు చేసిన రైతులకు మాత్రమే అవసరం మేరకు ఎరువులను విక్రయించాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పక బిల్లులను ఇవ్వాలన్ని హెచ్చరిం చారు. ఇతర జిల్లాలకు ఎరువులను విక్రయించరాద న్నారు. అధికారుల అనుమతులను పాటించని షాపులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మన్నారు. కుంటలోని 28.28.0 ఎరువులకు అనుమ తి పత్రాలు లేని కారణంగా రూ.1.85 విలువైన 5.45 మెట్రిక్ టన్నుల మేర అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. ఏఎస్సై వెంకట సుబ్బయ్య, పోలీస్, వ్యవ సాయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండల కేంద్రమైన త్రిపురాంత కంలోని అన్ని ఎరువుల, పురుగుమందుల దుకాణా ల్లో సీఐ అస్సాన్, ఎస్సై శివబసవరాజు మంగళ వారం తనిఖీలు చేశారు. ఎరువులు ముఖ్యంగా యూరియాను గోడౌన్‌లలో నిల్వచేసి రైతులకు అందకుండా చేస్తున్నారని అందిన సమాచారం మే రకు తనిఖీలు చేశామని కానీ దుకాణాల్లో అటువం టి పరిస్థితి కనిపించలేదని, రికార్డు పరంగా నిల్వలు ఉన్నాయని ఎస్సై తెలిపారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించాలని చూసినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాచర్ల : రైతులకు అందించే యూరియాలో కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవ సాయాధికారి అధికారి షేక్ మహబూబ్ బాషా హెచ్చరించారు. అనుములపల్లి జీవనమూర్తి స్వామి ట్రేడర్స్, రాచర్లలోని రంగస్వామి ట్రేడర్స్ ఎరువుల షాపులను మంగళవారం పరిశీలించి స్టాక్ వివరాల నమోదును పరిశీలించారు.

పొగాకు రైతులు ప్రభుత్వ అను మతి లేకుండా సాగు చేస్తే కొను గోలు చేయమని ఏవో మహబూబ్ బాషా సంగపేట, రామాపురం రైతులతో అన్నారు. పొగాకు నర్సరీ రైతులు విచ్చలవిడిగా నారు పోసి రైతులకు అమ్మవద్దని అలా చేస్తే నర్సరీలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, పశువైద్య సి బ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పట్టణంలోని ఎరువుల షాపులను సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదుబాబు తనిఖీ చేశారు.

కొనకనమిట్ల : ఎరువులను అధిక ధరలకు విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ ప్రభాక ర్‌రెడ్డి హెచ్చరించారు. చోటపల్లిలోని ఎరువు దుకా ణాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం నిల్వ ఉంచిన ఎరువుల బస్తాలను తనిఖీ చేశారు.

పొదిలి : ఎరువుల దుకాణాలను ఎస్ఐ వేమన మంగళవారం తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టిం చినా, రైతులకు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వినాయకుడికి విశేష పూజలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో వినాయక చవితి నవరాత్రులు వైభ వంగా నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల వద్ద కొలువుదీరిన వినాయకులకు మంగళవారం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. కోనేటి వీధిలోని వినాయకునికి తమలపాకుల అలం కారం నిర్వహించారు. మెయిన్ బజార్, పూలసుబ్బయ్య వీధి, రాజీవ్ కాలనీ, అలుగు వీధి, తూర్పువీధి తదితర ప్రాంతాలలో వినాయక మండపాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పూలసుబ్బయ్య కాలనీలో వినాయకుడు


కంచిపల్లి చెరువుకు చేరుతున్న నీరు

చెరువులకు చేరుతున్న నీరు

గిద్దలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షం నీరు ఇప్పుడిప్పుడే చెరువులకు చేరడం మొదలైంది. అటవీ ప్రాంతంలో కురిసిన నీరు తొలుత గుండ్లమోటు ప్రాజెక్టు చేరింది. అక్కడి నుంచి కంచిపల్లి చెరువుకు ఎనుమలేరు వర దనీటి సహాయంతో నిదానంగా చేరుకుంటున్నది. కాగా ఎనుమలేరు నీటిలో కొద్ది భాగం ముండ్లపాడు చెరువు వైపుకు కూడా పయనిస్తుండ డంతో భూగర్భజలాల సమస్య తీరబోతున్నదని రైతుల్లో ఆనందం వ్యక్త మవుతున్నది.

చెరువు కాలువ అభివృద్ధి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు పంచాయతీలో ఉన్న ఓబులపతి తిమ్మరాజు చెరువుకు కాలువ ద్వారా నీరు రాక సుమారు 20 సంవత్సరాలు అయింది. 20 సంవత్సరాల నుంచి చెరువుల్లో నీరు లేక ఈప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. నూతనంగా ఈ చెరువుకు చైర్మన్‌గా ఎన్నికైన నల్లగట్ల వెంకటనరసయ్య, గ్రామ ఉపసర్పంచ్ కడియం శేషగిరిరా వులు కలిసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అధికారులకు కాలువ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేయించాల న్నారు. దీంతో కాలువకు నీరు అందకుండా ఉన్న పూడికను గ్రామ రైతులు తొలగించారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఆ కాలువ ద్వారా చెరువు నీరు అందుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు


కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

తర్లుపాడు, సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని కోటగిరిలో బాలత్రిపురా సుందరీదేవి అమ్మవారికి మహిళలు లలితా సహస్ర కుంకుమార్చ పూజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గణనాథు డికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం మహిళలు అమ్మవారికి కుంకు మార్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు ఓరుగంటి శ్రీరామ శాస్త్రీ ఆధ్వర్యంలో కుంకుమ అర్చన పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి స్థానిక పాతబస్టాండ్‌లో రాహుల్ చిత్రపటాలను తగులబెట్టారు. అనం తరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. బిహా ర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అయినా రాహుల్ వాటిని ఖండించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరోజిని, లక్ష్మీ, చంద్రశేఖర్, ప్రవీణ్, కిరణ్, షబానా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, సెప్టెంబర్2 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం - గజ్జలకొండ రైల్వే స్టేషన్ మధ్యలో సోమవారం రాత్రి కొండవీడు ఎక్స్ ప్రెస్ నుంచి జారిపడిన వ్యక్తి కమలకంటి హరిబాబు (39) చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామానికి చెందిన కే హరిబాబు కొండవీడు ఎక్స్ ప్రెస్‌లో సోమవారం రాత్రి మిత్రులతో కలిసి గుంటూరు రైల్వే స్టేషన్ లో రైలు ఎక్కారు. గజ్జలకొండ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రైలులో చేయికడుక్కుంటూ గేటులో నుంచి జారి కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన స్నేహితులు చైన్‌లాగి రైలును ఆపారు. తీవ్ర గాయాలైన హరిబాబును రైల్వే పోలీసుల సహాయంతో స్థానిక ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు హరిక్రిష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొమరోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చిన మోటర్ సైకిల్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండ లంలోని గిద్దలూరు - తాటిచర్ల మోటు మధ్యలోని జాతీయ రహదారి లోని దద్దవాడ సచివాలయం సమీపంలో జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. గిద్దలూరు మండలంలోని పొదలకుంటపల్లి గ్రామానికి చెందిన కుప్పాల కొండయ్య పనిమీద బేస్తవారిపేట మండలం మోక్షగుండంకు మెటార్‌సైకిల్‌పై వెళ్లారు. పని ముగించు కొని మోటర్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలోని దద్ద వాడ గ్రామ సచివాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండయ్య మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలకు వ్యాక్సినేషన్

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం కుక్కలను పలు ప్రాంతాల్లో పట్టుకున్నారు. ఈ సంద ర్భంగా కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ.. యానిమల్ బర్త్ కంట్రోల్ యాంటీ ర్యాబిస్ కార్యక్రమం ద్వారా వీధి కుక్కలు పట్టామని, కుక్కల సంతాన నిరోధానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టుకున్న కుక్కలను దూర ప్రాంతాల్లో వదిలివేస్తామని, పట్టణంలోని అన్ని ప్రాంతాలలో దశలవారిగా కుక్కలను పట్టి వాటికి సంతాన నిరోధకానికి వ్యాక్సినేషన్ వేయిస్తామన్నారు.


కోటయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

కోటయ్య ఆశయాల సాధనకు కృషి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేగినాటి కోటయ్య సేవలు ఎనలేనివని, ఆయన ఆసయ సాధనకు కృషి చేస్తామని టీడీపీ ఇన్ చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. కోటయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ప్రధాన సెంటరులో వేగినాటి కోటయ్య కాంస్య విగ్రహానికి ఎరిక్షన్‌బాబు, కోటయ్య తనయుడు వేగినాటి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగినసభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎర్రగొండపాలెంలో ప్రజలకు అవసరమైన పాలశీతలీకరణ కేంద్రం, జూని యర్ కాలేజీ, చెంచు విద్యార్థులకు గురుకుల పాఠశాల, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలలో 15 పైగా జడ్పీ ఉన్నతపాఠశా లలను మంజూరు చేయించి విద్యాభివృద్ధికి కోటయ్య కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వళరాజు, టీడీపీ ముఖ్యనాయకులు చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, కాకర్ల కోటయ్య, టీవీ సుబ్బారెడ్డి, అచ్యుతరావు, మంత్రునాయక్, సత్యనారాయణగౌడ్, నాగేశ్వరరావు, నాసరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌వలి, చేదూరి లక్ష్మయ్య, పోకా వెంకట సుబ్బయ్య, సుబ్రమణ్యం, గోళ్లరావు పాల్గొ న్నారు. అనంతరం పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యతో సత్ఫలితాలు


విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న నోడల్ అధికారి

రాచర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యతో సత్ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వీ గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని ఆకవీడు, చోళ్లవీడు పంచాయతీల్లోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమ యపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలన్నారు. అనంతరం ఆయన పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సల హాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఎంఈవో షేక్ మొయినుద్దీన్, కూడా పాల్గొని పాలకవీడు ఎంపీపీఎస్‌ను తనిఖీ చేశారు.

వైఎస్సార్‌కు నివాళి


వై ఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక గడియార స్తంభం వద్ద ఆయన విగ్రహానికి నివాళి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహా నికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకరవ్గ సమన్వయకర్త అన్నా రాంబాబు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి వైఎస్సాఆర్ అన్నారు. ఆయన రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెన్నా హనుమారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, పట్టణ పార్టీ అధ్య క్షులు షేక్ సలీం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో వృద్ధుడికి పించన్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసింహ స్వామిమెట్ల సమీపంలో ఉంటున్న మోడిగారి పుల్లయ్యకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సొంత నిధుల నుంచి ప్రతి నెలా రూ.4వేలు పింఛన్ అందజేస్తున్నారు. మంగళవారం కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్‌యాదవ్ పింఛన్ డబ్బును పుల్లయ్యకు అందచేశారు. ప్రభుత్వం నుంచి పుల్లయ్యకు పింఛన్ మంజూరయ్యే వరకూ ఎమ్మెల్యే సొంత డబ్బులు అందజేస్తున్నారని చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తోట శేష గిరి, వలసాని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, యక్కింటి వెంకటసుబ్బయ్య, శివ తదితరులు ఉన్నారు.

ఘనంగా పవన్ పుట్టినరోజు వేడుకలు


పవన్ కల్యాణ్ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి శ్రేణులకు, అభిమానులకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృష్ణార్జునలాగా పాలిస్తు న్నారన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా చంద్ర బాబు, పవన్ ముందుకు సాగుతున్నార న్నారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అనురాజుల రాజశేఖర్, జనసేన వీరమహిళ అనురాజుల దుర్గ, జిల్లా నాయకులు లంకా నరసింహారావు, ఉదయగిరి మల్లికార్జునరావు, గజ్జలకొండ నారాయణ, కాల్వ బాలరంగయ్య, మున్సి పల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాల య్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీ శ్వరయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానే షావలి పాల్గొన్నారు.

కంభం : పట్టణంలో డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే అశో క్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన ఇన్చార్జి బెల్లంకొండ సాయిబాబాలు ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. కంభం పట్టణ స్టేట్ బ్యాంకు సమీపంలో కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. కందులాపురం సెంటర్‌లో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు.

రాచర్ల : రాచర్ల బస్టాండ్‌లో జనసేన యువనాయకుడు ఉలాపు శంకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడు కలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి సాయిబాబా, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, గిద్దలూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మండల నాయకులు కటిక యోగానంద్, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, టీడీపీ నాయకులు బత్తిని వెంకటేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. జనసేన పార్టీ జిల్లా ప్రోగ్రామ్ కమిటి సభ్యుడు చింతగుంట్ల మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జన సేన నాయకులు పాకనాటి పృథ్వీరాజ్ కేకును కత్తిరించి అభి మానులకు శుభా కాంక్షలు తెలియ జేశారు. తొలుత స్థానిక శ్రీ షిరిడీ సాయిబాబ మందిరంలో ప్ర త్యేక పూజలు నిరహించారు. అనంతరం అన్నసంతర్పణ గావించారు. మండలం లోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో 72 మందికి గుప్పట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాతకోటి సుబ్బారావు, చల్లా సురేష్, పెద్ద పండు, పసుపులేటి సుధాకర్, కంచెర్ల రామాంజనేయ గౌడ్, ఎలకపాటి రాహుల్, కాటి చందు తదిత రులు పాల్గొన్నారు.

మార్కాపురం : జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పుట్టి నరోజు సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ మంగళవారం బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు ఎగ్జా మ్ ప్యాడ్స్‌ను అందజేశారు. ముందుగా హాస్టల్‌లో కేక్ కత్తిరించి పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పేరూరి రమేస్, షేక్ ఖాశింవలి, బి.కొం డల్, డి.ఖాశిం, నిశనం పాపయ్య, దమ్మని చందు, యమ్మని శివకృష్ణ పాల్గొన్నారు.

పొదిలి : పట్టణంలో పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వ హించారు. పెద్దబస్టాండ్ సెంటర్‌లో ఏ ర్పాటు చేసిన భారీకేక్‌ను టీడీపి నాయకు లు కందుల రోహిత్‌రెడ్డి కట్‌చేసి నాయ కులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఇలాంటి పండుగ వాతావర ణంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంద న్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు : డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయ కులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వెలుగు కాశీరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు 3వేల పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ వీరభద్రస్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో నాయకులు శ్రీనివాసులు, కాశీ రామ్ సింగ్, సొసైటీ చైర్మన్ వెలుగు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : డిప్యూటీ సీఎం పుట్టిన రోజు సందర్భంగా నాయకులు చౌటపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. జన సేన పార్టీ, టీడీపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ ఆరోగ్యంగా ఉండాలని ఆంజ నేయ స్వామికి పూజలు చేశారు. కార్యక్ర మంలో జనసేన మండలాధ్యక్షుడు కోటూరి అచ్చయ్య, ఆర్మిబుజ్జి, పసుపులేటి బుజ్జి, టీడీపీ నాయకులు గజ్వేల్లి భాస్కర్ రావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు మేడికొండ అనిల్ చౌదరి, జనసేన నాయకులు కృష్ణ, కోటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.


శ్రీను మాస్టారిని సన్మానిస్తున్న గ్రామస్థులు

మాస్టర్ శ్రీనుకు సన్మానం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపా ధ్యాయుడిగా పని చేస్తున్న మండ్ల శ్రీనును గ్రామ ప్రజలు మంగ ళవారం సన్మానించారు. ఆయనకు ఎస్‌పీఎల్‌టీవో ఆర్గనైజేషన్ సర్వేపల్లి రాధా కృష్ణ జాతీయ అవార్డును అందజేసిన నేపథ్యం లో గ్రామ ప్రజలు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాలకవీటి శ్రీనువాసులు, గాదె కాశీరావు, విద్యా కమిటీ చైర్మన్ యక్కలి వెంకట సుబ్బారావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలానందంతో బహుళ ప్రయోజనాలు

కంభం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రేడియోలో వచ్చే బాలానందం కార్యక్రమాలతో బహుళ ప్రయోజనాలను, సంతో షాలను పొందవచ్చని ఎంఈవో 2 శ్రీనివాసులు అన్నారు. పారు కవీధి పాఠశాలలో మంగళవారం బాలానందం రేడియో కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆకాశవాణి మార్కాపురం రేడియో స్టేషన్ ప్రకటనకర్త వీవీ నరసింహారావు పాఠశాల విద్యార్థులతో పాటలు, పద్యాలు, దేశభక్తి గీతాలను పాడించి రికార్డు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డీవీ అరుణ వ్యాఖ్యాతగా వ్యవ హరించి విద్యార్థులను పరిచయం చేస్తూ ప్రోత్సహించారు. ఇటు వంటి కార్యక్రమాల ద్వారా కళా నైపుణ్యాలు, సామాజిక అవగా హన పెంపొందుతాయని తెలిపారు. మార్కాపురం రేడియో స్టేషన్ ద్వారా 101.5 మెగా హెడ్జ్ పై ఆదివారం ఉదయం 9.30గంటలకు ప్రసారం అవుతుందని అనౌన్సర్ నరసింహారావు తెలిపారు.


ఇటుకల బట్టీలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

అనుమతులు తప్పనిసరిగా ఉండాలి

బట్టీలను తనిఖీ చేసిన తహసీల్దార్ మంజునాథరెడ్డి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఖజానాకు కొందరు గండి కొడుతూ కర్రను అక్రమం గా తరలిస్తున్నారని గత నెల 31వ తేదీన ఆంధ్రజ్యోతిలో కర్ర అక్రమ రవాణా అనే కథనంపై తహసీల్దార్‌డీ మంజునాథరెడ్డి స్పందించారు. ఆయన ఇటుక, బొగ్గుల బట్టీలను మంగళవారం తనిఖీ చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు. ప్రభుత్వ ఖజానాకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా బట్టీలను నిర్వహించాలని యజమానులతో సూచించారు.

హాస్టల్ విద్యార్థికి అనారోగ్యం

రాచర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అను ములవీడు బీసీ బాలుర వసతి గృహంలో 10వ తరగతి చదువు తున్న జీ నాగచరణ్ సోమవారం రాత్రి అనారోగ్యానికి గుర య్యాడు. గమనించిన హాస్టల్ వార్డెన్ ఎస్.మురళి వెంటనే 108కు సమాచారం అందించి విద్యార్థికి ప్రథమ చికిత్సను అందించి అనంతరం గిద్దలూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థికి గ్యాస్ సమస్యగా గుర్తించారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ చెప్ప డంతో హాస్టల్‌కు తీసుకొచ్చినట్లు వార్డెన్ మురళి తెలిపారు.

వైభవంగా గణనాథులకు పూజలు

ముండ్లమూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక మండపాల్లో మంగళవారం గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుగల్లు, పెదఉల్లగల్లు, కొత్తూరు, వేములబండ, ఈదర, వేముల, శంకరాపురం, మారెళ్ళ గ్రామాల్లో వినాయకుని విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా, వేములబండలో వినాయకుని లడ్డును దుగ్గినేని రామాంజీ రూ.46వేలకు దక్కించుకున్నారు. కాగా, ముండ్లమూరులో నాగార్పమ్మ అమ్మవారి ఆలయం ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం నిమజ్జనానికి తరలించారు. అలాగే, వేముల, పెదరావిపాడు, నూజెండ్లపల్లి, శంకరాపురం, కెల్లంపల్లి, ఈదర, మారెళ్ళ గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు.

బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో బస్ షెల్టర్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీంను చింతలపూడి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చెక్క వెంకటేశ్వర్లు, కాటూరి ఏడుకొండలుతో పాటు మరికొంతమంది కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాలు కురిసినప్పుడు బస్ షెల్టర్ లేక పోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు వారు పేర్కొన్నారు. స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియపరుస్తానని ఎంపీడీవో తెలిపారు.

నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతంచేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేత్ర దానపక్షోత్సవాలను విజయవంతం చేయాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక పేర్కొన్నారు. మంగళవారం తూర్పుగంగవరంలో జరిగిన నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి నేత్రాలను దానం చేస్తే మరొకరికి చూపు ప్రసాదించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, అప్తాలమిస్ట్ ఉమ, హెచ్‌ఐవో కె.చంద్రశేఖర్, పీహెచ్‌ఎన్‌ఎం వి.రమణ, హెచ్‌పీ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగుచేసిన ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో టి.అబ్రహం లింకన్ తెలిపారు. మండలంలోని చింతలపాలెం, బలిజపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కల్యాణ్, వృతి, గ్రామ పశుసంవర్థక సహాయకులు రూఫియా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పామూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సింగిల్ పేరంట్స్ కలిగిన 50మంది విద్యార్థులకు పీఆర్‌ఎల్ ఫౌండేషన్ చైర్మన్, పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో పెద్దిరెడ్డి కోటిరెడ్డి మంగళవారం దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో -2 కరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు కోటిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పెరంట్స్ కమిటి చైర్మన్ గుత్తి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి

పామూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 వేలు అందజేస్తుందన్నారు. మండలంలో రెండు వందల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేయాలన్నారు. ఉపాధి కూలీలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరామయ్య, ఏపీవో బి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు

పామూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను తీవ్రంగా హింసిస్తున్న తన భర్తపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు సీఐ ఎం.భీమానాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ మోబీనాకు పామూరుకు చెందిన షేక్ షరీఫ్ అలియాస్ మౌలానా షరీఫ్‌తో 2020లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె అత్త షేక్ బీబీజాన్, ఆడపడుచు రజియాలు తన భర్తకు లేనిపోని చాడీలు చెబుతున్నారని పేర్కొన్నారు. వారి మాటలతో తన కొట్టి హింసిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతకుముందే తన భర్తకు పెళ్లి అయిందని తెలిపారు. ఈ విషయం తెలియకుండా మోసం చేసి నన్ను రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె పేర్కొన్నారు. ఈవిషయంపై నిలదీస్తే చిత్ర హింసలు పెడుతున్నారని తెలిపారు. తన భర్తపై విచారణ చేపట్టి నన్ను హించిన వారిపై చర్యలు తీసుకొని న్యాం చేయాలని కోరారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

వీసీపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సమస్యలపై జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా పట్టాదారు పాసుపుస్తకాల జారీ, జాయింట్ ఎల్పీఎమ్‌లు, సర్వే సమస్యలు, రికార్డు సవరణలు, వారసత్వ హక్కులు తదితర అంశాలను మండల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై సమీక్షించిన ఆయన వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ ఉషకు సూచించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను వాయిదా వేయకుండా వేగంగా పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతుందని చెప్పారు. తహసీల్దార్ స్థాయిలోనే ఎక్కువ సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని ఆయన అన్నారు. రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన గడ్డిని పెంచేందుకు భూములను కౌలుకు ఇచ్చే రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.30 వేలు కౌలు చెల్లించనున్నట్టు చెప్పారు. భూములను కౌలుకి ఇస్తామని వచ్చే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దార్‌కు సూచించారు. హరిజన వాడలకు శ్మశానవాటికలు కావాలని కోరిన ప్రతి కాలనీకి భూములను గుర్తించాలన్నారు. అవసరమైతే భూములను కొనుగోలు చేసైనా శ్మశానవాటికలకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 72 అర్జీలు వచ్చాయి.

కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ, పీఏసీఎస్ చైర్మన్ పరిమి ఈశ్వరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, నేరేడుపల్లి సర్పంచ్ వల్లా మల్లికార్జున్, పువ్వాడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లో రాష్ట్ర భవిష్యత్తు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మెగా జాబ్ మేళాలో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దర్శి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. స్థానిక పీటీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో యువత కీలకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విస్తారంగా పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. వారి స్ఫూర్తితో దర్శి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఏడాది జాబ్ మేళా ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏడాది ఆనవాయితీగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

గత వైసీపీ పాలకులు అవలంబించిన కక్షపూరిత వైఖరితో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. యువత గురించి పట్టించుకోకపోవటంతో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు విరివిగా వస్తున్నందున యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా ఉన్నత శిఖరాలు అందుకునే అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నా రపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రమాదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడి అంజనేయులు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 34 కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 612 మంది నిరుద్యోగులు హాజరుకాగా 192 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. మిగిలిన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

కాగా, దర్శి పట్టణంలోని 19వ వార్డులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు పూజలు చేశారు. అనంతరం కాకతీయ కమ్మ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలు కోలాటం ప్రదర్శించారు.

పల్లె ప్రగతిపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

» ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



కనిగిరిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, జనసేన నాయకులు నాగరాజు, దేవకి

కనిగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతిపై ప్రత్యేకంగా దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసంనడుం బిగించిన నేత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన నాయకులు నాగరాజు, దేవకి వెంకటేశ్వర్లుతో కలసి మంగళవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పాలన అందించటంలో డిప్యూటీ సీఎం అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదన్నారు. జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు, దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా వచ్చే జీతాన్ని కూడా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న నేత పవన్‌కల్యాణ్ ఒక్కరేనని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

దర్శిలో పుట్టినరోజు వేడుకలు

దర్శి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను దర్శిలో మంగళవారం కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పుట్టినరోజు కేకు కట్‌చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాట పటిమతో పవన్‌కల్యాణ్ ఉన్నత శిఖరాలు అందుకున్నారని ప్రశంసించారు. క్రమశిక్షణకు, నిబద్ధతకు ఆయన మారుపేరుగా నిలిచారన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, జనసేన నాయకులు కుప్పాల పాపారావు, పసుపులేటి చిరంజీవి, బీజేపీ నాయకుడు టి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కేకు కట్ చేశారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం. షఫీఉల్లాఖాన్(బాజి), బండారు వెంకట్, పులిమి రమణాయాదవ్, ఆసా సాంబశివరావు, షేక్ సుభానీ, శ్రీరాములు, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం పీసీపల్లిలో కేకు కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేతుల మీదుగా రోగులకు పాలు, పండ్లు పంపిణీచేశారు. తదనంతరం పేదలకు దుస్తులు పంపిణీచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేమూరి రామయ్య, పువ్వాడి నాగరాజు, పులి ప్రతాప్‌రెడ్డి, బత్తుల రామక్రిష్ణ, నాగేష్, మల్లికార్జున, మోహన్‌క్రిష్ణ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పసుపుగల్లు బస్టాండ్ సెంటర్‌లో 15 కేజీల కేక్‌ను జనసేన మండల అధ్యక్షుడు తోట రామారావు కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగార్జున, గూడాల శివశంకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, గోపిశెట్టి నాగార్జున, బంగారయ్య, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో చీరెలు పంపిణీ



దర్శిలో కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్

పామూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద కేకు కట్‌చేశారు. ఈసందర్భంగా జనసేన నాయకులు వెంగళశెట్టి బాబురావు ఆర్థిక సహకారంతో 125 మంది నిరుపేద మహిళలకు సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబుతో కలిసి చీరలు పంపిణీ చేశారు. స్థానిక పద్మావతి అతిథి గృహంలో 95 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వరికూటి నాగరాజు, దేవకి వెంకటేశ్వర్లు, కేవీ రమణయ్య, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

» డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్



కనిగిరిలో పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కనిగిరి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో పోలీసుశాఖకు వన్నె తేవాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. పట్టణంలో అల్లర్లకు, గ్రూపుతగాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. సర్కిల్ పరిధిలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ శ్రీరాం, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

పామూరు స్టేషన్ తనిఖీ

పామూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరిగేలా కృషిచేసిన పోలీస్ అధికారులతో పాటు సిబ్బందిని అభినందించారు. రాత్రుళ్ల పోలీస్ బీట్ ను పెంచి చోరీలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.భీమానాయక్, ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక విరువూరు రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్ట్ అంటూ పోలీసుల దుస్తుల్లో ఆన్‌లైన్‌లో ప్రజలను భయపెడుతున్నారు. ఈక్రమంలో నగదును ట్రాన్స్‌ఫర్ చేయాలని మోసం చేస్తున్నారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా అనుమానం ఉంటే సంబంధిత పోలీసులను సంప్రదించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో షేక్ గౌస్‌బాషా, ఎంపీటీసీ బి.నరసింహారావు, కేవీ రమణయ్య, సయ్యద్ అమీర్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, ఎస్వీ నారాయణ, ఆర్‌ఆర్ రఫీ, ముబీనా మౌలాలి, షేక్ ఖాజారహంతుల్లా, షత్తు మస్తాన్, కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పేర్కొన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో తాళ్లూరు, కొత్తపాలెం, కొర్రపాటివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భగా ఏవో మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో బీటీఎం శేషారావు, ఏటీఎం రామిరెడ్డి, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, నరసింహులు, వాణి, కోటి రత్నం, పల్లవి, అంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రామారావు, సిబ్బంది

ఎరువుల దుకాణాల తనిఖీలు

దర్శి సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని ఎరువుల దుకాణాలను సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. యూరియా, ఎరువుల వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సీఐ రామారావు పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల నిర్వాహకులు క్రయ, విక్రయాలను నిబంధనల మేరకు నిర్వహించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో ఎరువుల దుకాణాలను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మంగళవారం ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు తనిఖీ చేశారు. దుకాణల్లోని రిజిష్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైనమేర ఎరువులను అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు యత్నించినా, అక్రమాలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



సీబీజీ ప్లాంట్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివాకరపల్లి సమీపంలో నిర్మిస్తున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్లాంట్ ప్రదేశంలో నాలుగు దిక్కుల్లా మొక్కలు నాటారు. మంగళవారం ప్లాంట్ ప్రహరీగోడ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని రిలయన్స్ ప్రతినిధులను ఆదేశించారు. ఈప్లాంట్ ద్వారా రైతులకు పెద్దఎత్తున మేలు జరుగుతుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు వలసలు ఆగిపోతాయన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధి ఫణీందర్, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, పువ్వాడి నాగరాజు, విజయ్, ఏనుగంటి శ్రీను, దేవరపు కొండపనాయుడు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వీరపనేని పెద్దన్న, పులి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కు నివాళి



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

దర్శి సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను దర్శిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లూరు: వైఎస్ రాజరాఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం తాళ్లూరులో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోశం మధుసూదన్‌రెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, గోళ్లపాటి మోషె, మారం ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పామూరులోని వైసీపీ కార్యాలయంలో జరిగిన వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీ, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైవీ సాయికిరణ్, కందుల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండలో వైఎస్ విగ్రహాలకు వైసీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, తమ్మనేని సుబ్బారెడ్డి, గొంగటి పోలిరెడ్డి, తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన ఉగ్ర

పీసీపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు ములకా నాగేశ్వరరావును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తూ జరిగిన రోడ్డుప్రమాదంలో నాగేశ్వరరావు గాయపడ్డాడు. వైద్యశాలలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉగ్ర మారెళ్ల గ్రామంలోని నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఆయన పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

బత్తాయిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కనిగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బత్తాయి చెట్లకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ ఏవో విష్ణుప్రియ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వంగపాడు, గురవాజీపేట గ్రామాల్లోని బత్తాయి, కంది, సజ్జ సాగు పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బత్తాయిలో వేరుకుళ్ళు తెగులు ఆశించటం వలన ఆకులు పసుపు రంగులోకి మారి కాడలు వాలిపోతాయన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఆకాశం మబ్బులు కమ్మి తుంపర్ల వర్షం పడి వాతావరణం చల్లగా మారుతుందన్నారు. ఈసమయంలో సజ్జ పంటలో తేనే బంక తెగులు సోకే అవకాశం ఉందన్నారు. రైతులకు తమ పంటలో ఎక్కడైనా తేనె బంక తెగులు ఆశించినట్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రైతు ఈపంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు శారద, నవ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

ముండ్లమూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు తొమ్మిది గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సాయంత్రం వేంపాడు వద్దఉన్న ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎత్తిపోతల పథకం పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మన్ మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

పామూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు సక్రమంగా ఎరువులు అందజేయాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మంగళవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 3 సెప్టెంబరు 2025





18 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



నిర్ణయాలపై.. నీలినీడలు

- కోరం లేకుండానే కీలక తీర్మానాలు
- ఎన్జీ రంగా యూనివర్సిటీలో వింత పరిస్థితి
- ధ్వజమెత్తుతున్న విశ్రాంత వీసీలు, రిజిస్ట్రార్లు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గత ఏడాది తీసుకున్న కీలక నిర్ణయాలను కోరం లేకుండానే ఆమోదించారు. దీంతో ఆయా తీర్మానాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 2024-2025 మధ్యలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న అనేక నిర్ణయాలపై వర్సిటీలో పనిచేస్తున్న ఓ ప్రొఫెసర్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు బహిర్గతమైన తర్వాత పలువురు విశ్రాంత వీసీలు, రిజిస్ట్రార్లు స్పందిస్తూ కోరం లేకుండా తీసుకున్న నిర్ణయాలు చట్ట వ్యతిరేకమేనని తెలిపారు. ఆయా తీర్మానాల్ని వెనక్కి తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. కోరం కావాలంటే కనీసం ఆరుగురు సభ్యులు వర్సిటీ పాలక వర్గ సమావేశంలో పాల్గొనాలి. అయితే కేవలం ఐదుగురు సభ్యులతోనే కీలకమైన తీర్మానాలు ఆమోదింపజేశారు. సెక్రటరి హోదాలో సమావేశం ఏర్పాటుకు మాత్రమే పరిమితం కావాల్సిన రిజిస్ట్రార్‌ను కూడా కోరం జాబితాలో చూపించారు. ప్రొసీడింగ్ 315 ప్రకారం 2024 డిసెంబరు 20న జరిగిన సమావేశంలో 10484 తీర్మానం ప్రకారం ఆరు కొత్త కార్లు కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కేవలం వీసీ మాత్రమే భౌతికంగా పాల్గొనగ, మిగిలిన నలుగురు (వివిధ శాఖల అధికారులు) జూమ్‌లో పాల్గొన్నట్లు రికార్డ్ చేశారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించినా (మిగతా 6వ పేజీలో)

● ఆర్థిక కమిటీనే లేదు..

చట్టం ప్రకారం వర్సిటీ ఆర్థిక కమిటీని ఏర్పాటు చేయాలి. అందులో వీసీతో పాటు, కంప్ట్రోలర్, పాలక మండలి నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారు. వర్సిటీకి చెందిన ప్రతీ ఆర్థిక వ్యవహారం ఆ కమిటీ ఆమోదం మేరకు మాత్రమే జరగాలి. గడచిన రెండేళ్లుగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అసలు ఆర్థిక కమిటీనే ఏర్పాటు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఓ కీలక అధికారి కూడా అంగీకరించారు.

వీడని వరద

కృష్ణమ్మను వరద వీడనంటోంది. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో ఉరుకులు.. పరుగులతో ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఎగువ నుంచి వస్తోన్న నీటిని వచ్చినట్లుగా విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ సాగరం దిశగా పయనిస్తోంది. నాగార్జునసాగర్ జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.80 అడుగులు ఉంది. ఇదే విధంగా పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. దీంతో అటు సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు గేట్లు ఎత్తి నీటిని దిగువనకు వదులుతున్నారు. దీంతో కృష్ణమ్మ పుష్కరఘాట్లను ముంచుతూ.. కట్టలను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటివరకు 597 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు సమాచారం. జూలై 29 నుంచి నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఇప్పటి వరకు సాగర్ నుంచి దిగువకు 68,51,872 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో వైపు పంటల సాగుకు పుష్కలంగా డ్యాం నుంచి నీటి విడుదల చేస్తున్నారు.

సాగర్ గేట్లు బంద్

శ్రీశైలం నుంచి వరద తగ్గడంతో మంగళవారం రాత్రి 9 గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లను అధికారులు మూసి వేశారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో సాయంత్రం 5 గంటలకు 18 గేట్లకు తగ్గించారు. ఆ తర్వాత 7 గంటలకు 8 గేట్లు ఆపగా 9 గంటలకు గేట్లన్నింటినీ పూర్తిగా మూసివేశారు.

నిండుకుండల్లా జలాశయాలు

- నదిలో పెరుగుతోన్న ప్రవాహం
- నాగార్జున సాగర్‌లో 585.80 అడుగుల్లో నీరు
- ఇప్పటివరకు 597 టీఎంసీల కృష్ణాజలాలు కడలికి..

అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



(నరసరావుపేట, విజయపురిసౌత్, రెంటచింతల, తాడేపల్లి టౌన్, అచ్చంపేట, అమరావతి, ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ప్రభావంతో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదిలో మళ్లీ వరద ప్రవాహం పోటెత్తింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని వచ్చింది వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. గత 15 రోజుల నుంచి నదిలో నీటి మట్టం భారీగా పెరిగింది. వరద ప్రభావంతో ఘాట్లు నీటమునిగాయి. దీంతో ఎక్కడి కక్కడ రెవెన్యూ, పోలీసు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నదిలోకి ఎవరూ దిగకుండా పర్యవేక్షిస్తున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనాలతో నదీ తీరంలో బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఆగస్టు నెల ప్రారంభం నుంచి నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. కొన్ని దగ్గర్ల అయితే ప్రవాహం ప్రమాదకర (మిగతా 6వ పేజీలో)

చప్టాలపై ప్రవాహం..

కొల్లూరు: నదిలో మళ్లీ వరద పోటెత్తడంతో పలు ప్రాంతాల్లో చప్టాలపైగా ఉధృతంగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొల్లూరు మండలం అరవింద వారధి ఎగువన గండిలో నుంచి వరద నీరు పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలను చుట్టుముడుతోంది. దోనేపూడి కరకట్ట దిగువన ఉన్న పోతార్లంక చప్టాపై నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నదికి వస్తున్న వరదతో లంక గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. పలు ప్రాంతాల్లో తీరంలో, లంకల్లోని పంటలను కూడా ముంచేస్తోందని రైతులు ఆందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.



పోతార్లంక చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

ముచ్చటగా మూడోసారి విచారణ

జగనన్న మహిళా మార్ట్ అవినీతి తేలేనా

అద్దంకి, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): గత ప్రభుత్వంలో మెప్మా సభ్యుల పెట్టు బడితో నిర్వహించిన మహిళా మార్ట్‌లో అక్రమాలపై ముచ్చ టగా మూడోసారి అధికారులు విచారణ చేపట్టారు. రూ.11 లక్షల వాటా ధనాన్ని సభ్యుల నుంచి బలవంతంగా వసూలు చేసి మార్ట్‌ను 2022 ఫిబ్రవరి 3న అన్నక్యాంటిన్‌లో ప్రారంభించారు. లాభాలు పంచకపోగా సభ్యుల చేత బలవంతంగా వస్తువులు కొనుగోలు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్ట్‌ను ఖాళీ చేసి అన్న క్యాం టిన్‌ను ప్రారంభించింది. అయితే వేరే దగ్గర మార్ట్‌ను ఏర్పాటు చేస్తే అక్రమాలు వెలుగు చూస్తాయని ఏకంగా మూసివేశారు. ఈ క్రమంలో రెండు సార్లు జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. కాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలతో మూడో సారి మంగ ళవారం మార్ట్ సభ్యులను అద్దంకిలోని మెప్మా కార్యాలయంలో ఐబీ ఇంద్రసల్ బాబు, ఏవో భవాని విచారించారు. ఈ విచారణలోనైనా అవినీతి నిగ్గు తేల్చి వాటా ధనం చెల్లిస్తారని సభ్యులు ఎదురు చూస్తున్నారు.



సభ్యులను విచారిస్తున్న మెప్మా ఐబి ఇంద్రసల్‌బాబు, ఏఓ భవాని

బర్లీ నిధులు విడుదల

- తొలి విడతలో రూ.52 కోట్లు
- రైతుల ఖాతాల్లో జమవుతున్న డబ్బులు
- మరో వారంలో మలివిడత నిధులు విడుదల

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి తొలివిడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రాత్రి నుంచే ఖాతాల్లో నగదు జమవుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు సంక్షోభం నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దాదాపు రెండు నెలలుగా ఈ ప్రక్రియ జరుగుతుండగా నగదు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తొలివిడతలో బాపట్ల జిల్లాకు సంబంధించి రూ.22 కోట్లు, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు కలిపి రూ.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మరో వారం రోజుల్లో మలివిడత నిధులు జమ అవుతాయని మార్క్‌ఫెడ్ చెబుతోంది. దశల వారీగా బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించిన నిధులు జమ చేస్తామని రైతులు ఎవరూ కంగారు పడొద్దని మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. నాలుగు జిల్లాల పరిధిలో దాదాపు రూ.110 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా, తొలి విడతలో రూ.52 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి

- స్త్రీశక్తి విజయోత్సవంలో మంత్రులు అనగాని, గొట్టిపాటి

నగరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి తెలిపారు. నగరంలో మంగళవారం నిర్వహించిన స్త్రీశక్తి విజయోత్సవ సభలో మంత్రులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. ఉచిత బస్సు పథకానికి రూ.2 వేల కోట్లు ఖర్చు అవుతున్నా మహిళల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. రూ.50 కోట్లతో రేపల్లె-గంగడిపాలెం రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులకు పింఛన్లను తొలగించినట్లుగా వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఠంచన్‌గా ఇంట్లో పెద్దకొడుకుగా పింఛన్లను అందచేస్తున్నామన్నారు. మరో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పీఎంసూర్యఘర్ పథకాన్ని ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చంద్రబాబు సంపదను సృష్టించి వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నారన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంగం డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, శ్రీనివాసరావు, పంతాని మురళీధరరావు, లుక్కా గుడారంకయ్య, మత్తి అనురాధ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మరో మంత్రి గొట్టిపాటి రవి, తదితరులు

బార్లకు మరోసారి

- 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న కలెక్టరేట్లలో లాటరీ ప్రక్రియ

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల నుంచి స్పందన లేక.. రెండు సార్లు వాయిదా వేసినా



గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధిక బార్లకు వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో నిబంధనల ప్రకారం నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లకు ఇటీవల అధికారులు లాటరీ తీసి బార్ల నిర్వహణకు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో మిగిలిన బార్లకు మరోసారి దరఖాస్తు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో గుంటూరు జిల్లాలో 67 బార్లకు, పల్నాడు జిల్లాలో 30 బార్లకు, బాపట్ల జిల్లాలో 15 బార్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు గుంటూరు డీసీ డాక్టర్ శ్రీనివాసులు, బాపట్ల ఈఎస్ ఆయేషాబేగం మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం నుంచి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు. 15న కలెక్టరేట్లలో దరఖాస్తుదారుల సమక్షంలో బార్లకు లాటరీ నిర్వహిస్తామన్నారు.

ఎంపీ ల్యాడ్స్ పనులను పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ల్యాడ్స్ ద్వారా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఎంపీల్యాడ్స్ పనుల పురోగతిపై పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ, కెనాల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ పనుల్లో జాప్యంపై ఆరాతీశారు. పనులు మంజూరైన తర్వాత 45 రోజుల్లో మొదలు పెట్టి సంవత్సరంలోపు పూర్తి చేయాలన్నారు. ప్రారంభం కాని పనుల రద్దుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. 2023 సంవత్సరం నుంచి మంజూరైన పనులు, నగదు బదలాయింపులను ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో బ్యాంక్‌లో ఉన్న అకౌంట్లను రద్దు చేసి వాటిలో ఉన్న మిగులు మొత్తాలను ముఖ్యప్రణాళికాధికారి ఇచ్చే ఖాతాకు బదలాయించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి షాలెంరాజు, ఎస్‌ఈలు అనంతరాజు, రాజన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనుల పురోగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

మెప్మా పీడీగా ఆనంద్ సత్యపాల్

బాపట్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డి.ఆనంద్ సత్యపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటమురళి ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సత్యపాల్‌ను పీడీగా నియమించారు. దీంతో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ జె.వెంకటమురళిని సత్యపాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించటం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువుల డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. దుకాణాలు, గోదాములు పరిశీలించి లైసెన్స్‌కు సంబంధించిన పత్రాలు, స్టాక్‌రిజిస్ట్రార్‌లు, బిల్లులు పరిశీలించటం జరిగిందన్నారు. ప్రతి మండలంలో పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైతే స్టాక్ ఉన్నప్పటికి రైతులకు సరఫరా చేయకుండా కొరత సృష్టించిన, అధికధరలకు విక్రయించిన వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నగదుకు బదులు కాస్మోటిక్ కిట్లు



- వసతి గృహ విద్యార్థులకు పంపిణీకి సన్నాహాలు
- చార్జీలు పెంచి ఆ మేరకు కిట్లలో నాణ్యమైన వస్తువులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాస్మోటిక్స్ చార్జీలు సక్రమంగా అందక.. ఒకవేళ వచ్చినా కోతలతో వసతి గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కాస్మోటిక్స్ చార్జీలు పెంచడంతో పాటు నగదుకు బదులు విద్యార్థులకు నేరుగా వారికి అవసరమైన నాణ్యమైన వస్తువులతో కిట్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నగదు బదులు కాస్మోటిక్స్ వస్తువులను కిట్ల రూపంలో పంపిణీతో గోల్‌మాల్‌కు కూడా ఆస్కారం ఉండదని పలువురు భావిస్తున్నారు. దీనికితోడు తమకు అవసరమైన వస్తువులు ప్రభుత్వం కిట్ల రూపంలో పంపిణీ చేస్తుందని తెలిసి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, వసతిగృహాలు, ఆదర్శ పాఠశాలలు దాదాపు 100కిపైగా ఉండగా 12 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు 23 ఉండగా 11 వేల మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. వారందరికీ కాస్మోటిక్స్ కిట్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

కిట్లలో ఉండే వస్తువులు

సంక్షేమ హాస్టళ్ల, గురుకులాల విద్యార్థులకు కొబ్బరినూనె, టూత్‌పేస్టు, షాంపు, స్నానం, దుస్తులు ఉతుక్కునే సబ్బులు ఉంటాయి. విద్యార్థినులకు అదనంగా బొట్టు బిళ్లలు, పౌడర్, శానిటరీ నాప్కిన్ ఉంటాయి.

చార్జీల పెంపు ఇలా..

మూడో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థులకు గతంలో నెలకు రూ.100 చెల్లిస్తుండగా దానిని రూ.125కు పెంచారు. విద్యార్థినులకు రూ.110 నుంచి 130కి పెంచారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.125 నుంచి రూ.150, విద్యా ర్థినులకు రూ160 నుంచి రూ.200 పెంచారు. కేజీబీవీల్లోని ఇంటర్ విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200 వరకు, విద్యార్థినులకు రూ.160 నుంచి 250 వరకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచారు. బాలురకు హెయిర్ కటింగ్ చార్జీని రూ.30 నుంచి రూ.50కి పెంచారు. ఇలా పెంచే మొత్తాలకు కాస్మోటిక్స్ కిట్లు అందజేయనున్నారు.

ప్రభుత్వాలు మారినా తీరని భూసమస్యలు

- పరిష్కారానికి నోచుకోని రీసర్వే తప్పులు
- ఆందోళనలో రైతాంగం
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



తాళ్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా భూమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవటం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పులను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకవచ్చిన ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మేనేజ్‌మెంట్) విధానాలతో భూములు, స్థలాల అమ్మకాల కొనుగోలుకు ఇబ్బందులు తప్పటం లేదు. గత వైసీపీ ప్రభుత్వం శాశ్వత భూహక్కు కల్పిస్తామని ఎంతోఆర్భాటంగా చేపట్టిన భూరీసర్వే రైతులపాలిట గుదిబండలా మారింది. ఈ సమస్యలు పరిష్కరించటానికి రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో ఆరుచోట్ల పూర్తి చేశారు. మల్కాపురం, శివరాంపురం, దోసకాలపాడు, మాధవరం, శంకరనారాయణపురం, సార్వమిట గ్రామాల్లో గత ఏడాది రీసర్వే నిర్వహించారు. ఈసర్వే జరిగిన ప్రతిగ్రామంలో రికార్డులు తప్పులు తడకగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ అధికారుల్లు భూముల హక్కులు గలిగిన రైతులను సంప్రదించకుండా డ్రోన్ కెమెరా ఆధారంతో రీసర్వే జరపటంతో భూముల హద్దులు తారుమయ్యాయని వాపోతున్నారు. గ్రామా ల్లో రీసర్వే జరుగుతున్న విషయం కూడా రైతులకు తెలియకుండా ముగించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని రైతులు అనేకమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఎలా పరిష్కరించాలో తెలియటం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో 303 దరఖాస్తులు రాగా ఏడాది కాలానికి 132 పరిష్కరించారు. మరో 171 దరఖాస్తులు పరిష్కారం కాలేదు. శివరాంపురం గ్రామంలో అత్యధికంగా తప్పుల రికార్డుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని 119 దరఖాస్తులు రెవెన్యూ అధికారులకు అందజేశారు. వాటిలో జాయింట్ సర్వే తప్పులను మాత్రం దిద్దుబాటు చేయగా ఎల్‌పీఎం తప్పులను పరిష్కరించలేక పోతున్నారు. గతంలో పనిచేసిన అధికారుల తప్పిదాలవల్ల తమకు బ్యాంక్‌లో రుణాలు రీషెడ్యూల్ చేయటం లేదని, భూములను అమ్మకాలు, కొనుగోలు చేయాలన్నా కావటంలేదని, అధికారులు చేసిన తప్పిదాలకు తాము ఎందుకు ఇబ్బందులు పడాలని అధికారులను గ్రామ సభలో నిలదీయటం జరిగింది. ఆగ్రామానికి చెందిన కొందరు అప్పటి గ్రామ సర్వేయర్ సక్రమంగా పని చేయనందునే తమభూముల హక్కులు రీసర్వేలో తారుమారయ్యాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ సర్వేయర్ ఆధ్వర్యంలో పలువురు విచారించి వెళ్లారేగాని ఆసర్వేలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామంలోని రీసర్వేలోని తప్పులు దిద్దుబాటు జరగలేదని రైతులు వాపోతున్నారు. మాధవరం గ్రామంలో జరిగిన రీసర్వే తప్పులను సరిచేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అనేకమార్లు అధికారుల దృష్టికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అనేకమార్లు తీసుకెళ్లినా తప్పులు దిద్దుబాటు కావటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రీసర్వేల వల్ల గ్రామాల్లో తమ అనువంశిక ఆస్తులు, కొనుగోలు ఆస్తులు తప్పులుగా ఉన్నాయంటూ నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వీఆర్వోల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. రీసర్వే తప్పులను సరిదిద్దాలని భూహక్కుదారులు రెవెన్యూ సిబ్బందికి చేతులు తడుపుతున్నా పనులు మాత్రం కావటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు గైకొని రీసర్వే తప్పులను సరిదిద్ది తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

3.42 ఎకరాలు తొలగించారు

గతవైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో నాపట్టా భూమి 3.42 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన భూముల్లో సర్వే నెం.172లో 90 సెంట్ల భూమిలో 0.56సెంట్ల భూమి మాత్రమే రికార్డుల్లో ఉంది. తనకుగల 171/1 లో 1.70సెంట్లు, 164/12లో 54 సెంట్లు, 141/3లో 1.18 సెంట్లు కలిసి 3ఎకరాల 42 సెంట్లు భూమిరికార్డుల్లో కన్పించకుండా పోయింది. ఆభూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థం కావటం లేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఏమి చేయలేక పోతున్నారు.

- వద్దినేని శ్రీనివాసరావు శివరాంపురం

రీసర్వే తప్పిదాలవల్ల ఇబ్బందిగా ఉంది

నాఇద్దరు కుమారులు కండరాలవ్యాధితో బాధపడతున్నారు. చికిత్సనిమిత్తం డబ్బులు లేక పొలం అమ్మేందుకు వెళ్లిగా తన పేరున ఉన్న పొలం రికార్డులో కన్పించకుండా పోయింది. రెవెన్యూ అధికారులను అడుగగా గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తప్పులు దొర్లాయని చెప్పారు. కుమారులకు అత్యవసరంగా చికిత్సలు చేయించాల్సి ఉంది. తన పాస్‌బుక్‌లో ఖాతా నంబరు755లో 23/4లో0.17సెంట్లు, 23/5లో 0.35సెంట్లు, 14లో0.20సెంట్లు, 22/లో 0.28సెంట్లు 100/5 లో 0.13సెంట్లు కలిపి మొత్తం ఎకరా 13సెంట్లు ఆన్‌లైన్‌లో ఉంది. రీసర్వేలో తప్పిదం వల్ల కేవలం 0.32సెంట్లు మాత్రమే కన్పిస్తున్నది. మిగిలిన భూమి ఆన్‌లైన్‌లో లేకుంటే పొలం ఎలా అమ్ముకోవాలి, పిల్లలకు ఎలా చికిత్స చేయాలో అర్థం కావటంలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. పొలం అమ్ముదామనుకున్నా రీసర్వే వల్ల నాపేరున లేదు. రెవెన్యూ అధికారులు రీసర్వే వల్ల జరిగిన తప్పిదాలను పరిష్కరించాలి.

- కొడిమెల వెంకట్రావు, మాధవరం

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తూ రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం. జాయింట్ సర్వేలను త్వరితగతిన పరిష్కారం చేస్తున్నాం. రైతుల వద్ద నుంచి ఆధారాలు తీసుకుని రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తాం. ఎల్‌పీఎం రికార్డుల్లో నమోదయిన తప్పిదాలను రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళ్లి పరిష్కరిస్తున్నాం. రైతులు ఆందోళన చెందవద్దు. రీసర్వే తప్పిదాలపై దరఖాస్తులు అందజేస్తే పరిశీలించి తగు న్యాయం చేస్తాం.

- బీవీ రమణారావు తహసీల్దార్, తాళ్లూరు

ఎలుకల మందు తాగి ఇరువురు ఆత్మహత్యాయత్నం

- ప్రియుడి మృతి.. ప్రియురాలు పరిస్థితి విషమం

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణా ల మీదకు తెచ్చింది. వివాహిత ప్రియుడు మోజులో భర్త, పిల్లలను వదిలేసి గడప దాటింది. తిరిగి ఇంటికి వెళ్లలేక ఇరువురు కలిసి జీవించలేక చివరకు బలవన్మర ణానికి యత్నించారు. ఈ ఘటనలో ప్రియుడు వేల్పూరి రాకేష్ (30) మృతిచెందగా ప్రియురాలు సంతోషి ప్రాణాపాయ స్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించి నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని బోస్‌నగర్‌కు చెందిన వెల్పూరి రాకేష్, సాయి అనే ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురికి వివాహాలు కాలేదు. తల్లిదండ్రులు వారి చిన్నతనంలోనే చనిపోయారు. అయితే రాకేష్ బేల్దారి పనులతో పాటు అప్పుడప్పుడు క్యాటరింగ్‌కు కూడా వెళ్తుంటాడు. ఈ క్రమంలో చీరాలలోని జాండ్రపేటలో గల చౌడేశ్వరి కల్యాణ మండపంలో సెక్యూ రిటీగా పనిచేస్తున్న నంగు సంతోషితో అతనికి పరిచయం ఏర్పడింది. అప్పటికే ఆమెకు వివాహమై భర్త, ఇరువురు పిల్లలు ఉన్నారు. రాకేష్, సంతోషిల మధ్య పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం సంతోషి భర్తకు తెలియడంతో ఆమెను మందలించాడు. దాంతో 20 రోజుల క్రితం ఇరువురు ఇంటి నుంచి వచ్చేశారు. గుంటూరులోని లాడ్జిలో ఉంటున్నారు. వారి వద్ద డబ్బులు అయి పోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి బయలుదేరారు. భర్త పిల్లలను వదిలి వచ్చేసిన నేపథ్యంలో సంతోషి తిరిగి ఇంటికి వెళ్లడానికి భయపడింది. అంతేగాక ఇరువురు విడిపోయి ఉండడానికి ఇష్టపడలేదు. ఈ క్రమంలో ఇరువురు కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నారు. గత నెల 30వ తేదీ రాత్రి 8 గంటల సమ యంలో ఏటుకూరు బైపాస్ రోడ్డు సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శీతల పానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగారు. భయపడిన సంతోషి వెంటనే 108కు ఫోన్ చేయడంతో ఇరువురిని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందగా సంతోషి ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతోంది. సంతోషి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడు రాకేష్ తమ్ముడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

అద్దంకి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని కారు ఢీ కొనడంతో గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు ముండ్లమూరు మండలం వేములబండకు చెందిన కె.అంజమ్మ అద్దంకిలోని కెనరాబ్యాంక్‌లో పని కోసం వస్తూ మంగళవారం శ్రీనగర్ వద్ద నామ్ రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టి వెళ్లిపోయింది. గాయాలైన అంజమ్మ ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

నిర్ణయాలపై.. నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

రూ.కోట్లు కుమ్మరించి కొత్తవి కొనుగోలు చేశారు. ప్రొసీడింగ్ 316 ప్రకారం 2025 జనవరి 9న జరిగిన బడ్జెట్ సమావేశంలో వీసీతో పాటు భౌతికంగా ఇద్దరు, మరో ఇద్దరు అధికారులు జూమ్‌లో హాజరయ్యారు. తీర్మానం 10505 ప్రకారం సిబ్బంది ఉద్యోగోన్నతలకు సంబంధించి 2025 మే 12న జరిగిన సమావేశంలో ఇద్దరు భౌతికంగా, ముగ్గురు సభ్యులు జూమ్‌లో హాజరయ్యారు. ఇలా ప్రతి సమావేశం కోరం లేకుండానే జరగ్గా రిజిస్ట్రార్ పేరును కూడా మెంబర్‌గా చూపించి తీర్మానాలు రికార్డు చేశారు.

అన్నీ రద్దయ్యేవే..

విశ్వవిద్యాలయ చట్టం ప్రకారం బోర్డు ఏర్పాటు చేసే అత్యవసర, సాధారణ సమావేశాలకు అధ్యక్షుడి సహా ఆరుగురు సభ్యులు ఉండాలి. 2024-2025 మధ్య సుమారు 100 మందికి సీనియర్ సైంటిస్టులుగా, అసోసియేట్ సైంటిస్టులుగా ఉద్యోగోన్నతులు ఇచ్చారు. కొంతమంది సాంకేతిక సిబ్బంది సర్వీస్ ను క్రమబద్ధీకరించి జీతాలు పెంచారు. ఈ నిర్ణయాలన్నీ సక్రమం కాదన్న ప్రచారంతో గొడవ మొదలైంది..

శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బాల సంస్కార్ కేంద్రాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పురోభివృద్ధికి డాక్టర్ చాపల వంశీకృష్ణ దంపతులు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఎంఈవో కిషోర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సత్యనారాయణపురం, ఇస్లాంపేట, ప్రకాశం కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఈ కేంద్రాలలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం పూట ట్యూషన్లు చెప్పే విధంగా అనుభవజ్ఞులైన టీచర్లను నియమించడంతోపాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి డాక్టర్ వంశీకృష్ణ సొంత నిధులు వెచ్చించడం స్ఫూర్తిదాయకమన్నారు. సమాజ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో వస్రాంనాయక్

మార్టూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యాశాఖ కార్యాలయం నందు మంగళవారం భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేయుచున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. యంఈవో వస్రాంనాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెండవ యంఈవో కె ప్రేమలత,భవిత కేంద్రం నిర్వాహకులు సిహెచ్ నాగకుమారి,షేక్ ఆయేషా పర్వీన్,సిఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటరుకు బీరువా బహూకరణ

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): యద్దనపూడిలోని భవిత సెంటరుకు మంగళవారం ఐవైస్ రక్షక వెల్ఫేర్ ట్రస్ట్ అద్దంకి వారు బీరువాను బహుకరించారు. అంతేగాకుండా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను కూడా ట్రస్ట్ వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపీ, ట్రస్ట్ సభ్యులు ఖాసిం, దుర్గాప్రసాద్, ఆర్ సురేఖ, విజయగీతిక తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మార్టూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనపై దాడిచేసి కొట్టాడని మార్టూరులోని పడమర బజారుకు చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ బుల్లోడు అదేకాలనీకి చెందిన మర్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం పడమర బజారులో జరుగుతున్న వినాయకుని ఊరేగింపు కార్యక్రమం చేస్తూ ఉండగా,అనిల్ కుమార్ యాదవ్ తనను దాడిచేసి కొట్టాడని వెంకటేశ్వర్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యం శేషగిరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త ఆమె కుటుంబ సభ్యులు శారీరికంగా మానసికంగా వేధిస్తున్నారని, దుడ్డు హెమీయా ఇచ్చిన ఫిర్యాదు మార్టూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన దుడ్డు సతీష్ 9 నెలలు క్రితం కారంచేడు మండలంలోని జరుబులవారిపాలేనికి చెందిన హెమీమాను వివాహం చేసుకున్నారు..అయితే వివాహం జరిగిన మూడు నెలలు తర్వాత హెమీమాను భర్తతో పాటు అత్తామామలు శారీరకంగా, మానసికంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఈ విషయమై గత నెల 30న హెమీమా అన్నయ్య, అమ్మమ్మ, తాతయ్యలు చిమ్మిరిబండ గ్రామానికి వచ్చి సతీష్ కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి ప్రయత్నించారు. అయితే వారు హెమీమాను, ఆమె తరపున వచ్చిన వారిపై దాడి చేసి గాయపరచారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

రహదారి అద్దంలా.. మార్జిన్ అధ్వానంగా!

- చెన్నుపల్లి-అనంతవరం రోడ్డులో కష్టాలు
- వేమవరం-తాతపూడి మధ్య దారుణంగా మార్జిన్
- ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతేసంగతులు
- వర్షాలొస్తే పాట్లు పడుతున్న వాహనచోదకులు



రోడ్డు మార్జిన్ గోతులలో నిలిచిన వర్షపు నీరు

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే చెన్నుపల్లి-అనంతవరం రోడ్డు మార్జిన్ కష్టాలతో వాహనచోదకులను అవస్థలపాలు చేస్తోంది. రోడ్డు మాత్రం బాగున్నా మార్జిన్ మాత్రం గోతులతో నిండి ఉంది. దీంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని చెన్నుపల్లి అనంతవరం అర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న వేమవరం, మురికిపూడి, తాతపూడి గ్రామాల మధ్య తారు రోడ్డు బాగున్న సైడు మార్జిన్ మాత్రం అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది గ్రానైట్ వాహనాలు, నేషనల్ హైవేకు వెళుతుంటాయి. ఈ రహదారిని గతంలోనే కొంత భాగం డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయగా మరికొంత భాగంలో ఉన్న సింగిల్ రోడ్డుకు పూర్తిస్థాయిలో తారు వేశారు. రోడ్డు అభివృద్ధి పరిచినా మార్జిన్‌లను చేపట్టలేదు. దీంతో వాహనాలు రోడ్డు దిగితే దిగబడి పోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాలు రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లోడుతో వెళ్లే వాహనాలు సైడుకు దిగే వీలు లేకపోవటంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ రోడ్డులో కొందరు రైతులు తమ పంట పొలాల్లోని నల్ల మట్టిని రోడ్డు మార్జిన్‌లో కట్టలా వేయటంతో వర్షాలు కురిస్తే రోడ్డు మెత్త బురదమయం అవుతోంది. వేమవరం గ్రామంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వెళ్లే వాహనాలు ప్రతిరోజూ రోడ్డు మార్జిన్‌లో కురుకుపోతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే వేమవరం నుంచి తాతపూడి వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లను అభివృద్ధి పరచాలని వాహనదారులు కోరుతున్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మాచారి

పుస్తక నిర్వహణ సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు

చినగంజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ సంఘంలో డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన పుస్తకాల నిర్వహణ సక్రమంగా లేకుంటే గ్రామ సంఘాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పర్చూరు నియోజకవర్గ ఏరియా కో-ఆర్డినేటర్ లక్ష్మాచారి హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పుస్తక నిర్వహణపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మాచారి మాట్లాడుతూ పుస్తకాల నిర్వహణ అనేది డ్వాక్రా మహిళల ప్రగతికి గుండెకాయ లాంటిదన్నారు. ఇచ్చిన రుణాలను సక్రమంగా పుస్తక నిర్వహణ చేస్తే ఆర్థిక లావాదేవీల్లో తప్పులు లేకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంజీ. శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, సీసీలు వెంకటస్వామి, లక్ష్మి, మాధవి, వీవోఏలు పాల్గొన్నారు.

ముప్పవరంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక

పంగులూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముప్పవరం గ్రామంలో ఉపముఖ్యమంత్రి, జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు ఫణీంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో కేకు కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, జనసేన నాయకులు వెంకటేష్, భాను, వీరాంజనేయులు, కుక్కపల్లిఆంజనేయులు, గరిమిడి జగన్.పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

వీడని వరద

(5వ పేజీ తరువాయి)

స్థాయికి కూడా చేరింది. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు కూడా అధికారులు తరలిస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 3,03,644 కూస్కెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం వరకు 26 గేట్లు ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు ఆ తర్వాత 18 క్రస్ట్‌గేట్లకు పరిమితం చేశారు. మంగళవారం సాయంత్రానికి సాగర్‌కు ఇన్‌ఫ్లో 1,89,344 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 1,89,344 క్యూసెక్కులు ఉంది. ఇంకొన్ని రోజులు సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. జలాశయంలో పూర్తి స్థాయి సామర్థ్యం 312.04 టీఎంసీలకు 299.74 టీఎంసీలు నిల్వ ఉంది. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 2,25,106, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 33,130, కుడి, ఎడమ కాల్వకు కలిపి మొత్తంగా 2,75,492 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

- సత్రశాల టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుండడంతో 8 రేడియల్ క్రస్ట్ గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,43,704 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. వరద ప్రవాహం తగ్గడంతో మంగళవారం రాత్రి నుంచి రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించామన్నారు.

- పులిచింతలలో మంగళవారం 37.45 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,36,450 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 1,46,319 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

29 రోజులు నీటి విడుదల

జూలై 29 నుంచి మంగళవారం వరకు చూస్తే సాగర్ జలాశయం నుంచి 29 రోజులు నీటిని విడుదల చేశారు. జూలై 29న నీటి విడుదల ప్రారంభించగా ఆగస్టు 2 వరకు కొనసాగింది. ఆ తర్వాత 8 రోజులు గేట్లను బంద్ చేశారు. మళ్లీ ఆగస్టు 11 నుంచి ప్రారంభమైన నీటి విడుదల కొనసాగుతోంది. ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 11,35,133 క్యూసెక్కులు(98.70 టీఎంసీలు) నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 57,26,739 క్యూసెక్కులు(497.97 టీఎంసీలు) నీటిని విడుదల చేశారు. కుడి కాల్వకు 3,04,000 క్యూసెక్కులు(26.43 టీఎంసీలు) నీటిని ఇప్పటి వరకు విడుదల చేశారు. గత నెల 20న రికార్డు స్థాయిలో 4.61 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

- కోర్టు ఆవరణలో ఘటన

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయం కావాలంటూ కోర్టు ఆవరణలో భార్యాభర్తలిద్దరూ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గిద్దలూరులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం కేఎస్‌పల్లె పంచాయతీ పరిధిలోని అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిలక పిచ్చిరెడ్డి, భార్య నాగమణి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల వినాయకచవితి నిమజ్జనం సందర్భంగా తన కుమారుడైన రాజేష్‌రెడ్డిని కొందరు మద్యానికి బానిస చేసి తమను ఇబ్బందిపెడుతున్నారని కొందరిపై ఆరోపణలు చేయడంతో పాటు దుర్భాషలాడారు. ఈ విషయమై గ్రామానికి చెందిన వారు పిచ్చిరెడ్డిపై దాడి చేశారు. దీంతో పిచ్చిరెడ్డి, భార్య నాగమణి మంగళవారం గిద్దలూరు కోర్టులో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ ఎవరూ తనకు సహకరించలేదని మనస్తాపానికి గురైన భార్యాభర్తలిద్దరూ తాగారు. ఇది గమనించిన అక్కడి వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. పిచ్చిరెడ్డిపై దాడిచేసిన నర్రా కల్యాణి, నర్రా గిరిజ, నర్రా లక్ష్మీదేవి, నర్రా రంగస్వామిరెడ్డి, నర్రా శేఖర్‌రెడ్డిపై, అలాగే పిచ్చిరెడ్డి కూడా దుర్భాషలాడారనే అంశాలపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు.

ఆరోగ్యరంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మార్కాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యరంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జార్జి ఫార్మసీ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కాలేజీ ఆధ్వర్యంలో క్వాలిటీ అండ్ సేఫ్టీ ఇన్ హెల్త్ కేర్ అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్‌లో పలువురు విదేశీ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ రోగి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఆరోగ్యవేత్త ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ వెబినార్‌లో యూకే నుంచి ఎమినెంట్ స్పీకర్ డాక్టర్ సంజయ్ ధాంకింగ్, డాక్టర్ అబూ అలీమ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోకన్వీనర్ డాక్టర్ వై.సునీత, డాక్టర్ కె.అశోక్ బాబు, ఐసీఏసీ కో ఆర్డినేటర్ సయ్యద్ ముజీబ్‌తో పాటు సుమారు 400 మంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలకు పూర్తిస్థాయిలో టీచర్లు

ఒంగోలువిద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు పూర్తిస్థాయిలో టీచర్లను ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల్లో సాంకేతిక కారణాల వల్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని ఎస్‌జీటీ పోస్టులు ఓపెన్ కాలేదు. దీంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో రెగ్యులర్ టీచర్లు లేరు. ప్రస్తుత మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడెక్కడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయో వాటిని పరిశీలించి డీఎస్సీ కొత్త టీచర్లతో భర్తీ చేస్తామన్నారు. ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలు మెగా డీఎస్సీ నియామకాలకు ముందే పూర్తి చేయనున్నట్లు విజయరామరాజు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలల్లో కోరుకోని... రిలీవర్ రాని కారణంగా అదే పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రిలీవ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల వినతులను పరిశీలించి న్యాయసమ్మతమైన వాటిని పరిష్కరిస్తామని కమిషనర్ వెబెక్స్ సమావేశంలో తెలిపారు.

తడి, పొడిచెత్తను వేరు చేయాలి

- ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు

సింగరాయకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలో మంగళవారం ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు పర్యటించారు. చెత్తసేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి వాహనాల్లో వేయాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఇంటి యాజమాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొలతలు తీయాలని అధికారులకు సూచించారు. తదనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. మూలగుంటపాడు, సింగరాయకొండ మేజర్ పంచాయతీల్లో ఇంటి పన్నులు పూర్తిగా వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో రమేష్‌బాబుకు సూచించారు.

జరుగుమల్లి, వావిలేటిపాడుల్లో..

జరుగుమల్లి (కొండపి) : : జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల్లో చెత్త సేకరణను మంగళవారం ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు.

అవీ..ఇవీ..

వరిలో నానో ఎరువుల వినియోగం మేలు



వ్యవసాయ కూలీలతో కలసి వరినాట్లు వేస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరిసాగులో నానోఎరువుల వినియోగం లాభదాయకంగా ఉంటుందని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రామకూరు గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలతో కలసి వరినాట్లువేశారు. వరినాటేముందు ఆకుచివరల తుంచడంవలన తొలిదశలో పైరుకుఆశించే పురుగులను నివారించవచ్చన్నారు. రైతులు సమగ్రఎరువుల యాజమాన్య పద్ధతులు ఉపయోగించి పంటసాగు చేపట్టాలన్నారు.నానోయూరియా, నానోడి.ఎ.పి. వినియోగంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.అరలీటరు నానోయూరియా,నానో డి.ఎ.పి. ఒకబస్తా సాంప్రదాయ యూరియా,డి.ఎ.పి.లకు సమానమన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరి,బీ.బీ.జాన్, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో అంతర పంటలు సాగు చేయాలి

బల్లికురవ : పత్తి పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టటంతో పాటు స్వల్ప కాలిక పంటలైన పెసర, మినుము, సోయా చిక్కుడు వంటిపంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని వేమవరం, కొప్పెరపాలెం గ్రామాలలో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పత్తిలో అంతర పంటల సాగుపై అవగాహన కల్పించారు. తెగుళ్ల బారి నుండి పంటను రక్షించుకోనే చర్యలపై పలు మందుల వివరాలను తెలియజేశారు. అంతర పంటల వలన మిత్ర పురుగుల వ్యాప్తి పెరిగి పత్తి పైరును నష్ట పరిచే పురుగులను అదుపు చేయగలుగుతాయి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో షైలాలి, విఏఏలు శ్రీకాంత్, ఆదర్శ్ సాయి ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు సూచనలు

అద్దంకిటౌన్ : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృత్తి నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని ఏవో కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోరకు థయామిత్తక్సాం120 గ్రాములు ఎకరాకు మొక్క మొవ్వులో పడేటట్లు పిచికారి చేయాలని సూచించారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వీఏఏ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పొగాకు సాగుచేయొద్దు

సంతమాగులూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) సంతమాగులూరు మండలంలో ఎక్కడా రైతులు పొగాకు సాగుచేయవద్దని ఏవో సైదా సూచించారు. మంగళవారం సజ్జాపురం గ్రామంలో ఆత్మ వారి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ మండలంలో ఎక్కడ రైతులు పొగాకు సాగు చేయకూడదన్నారు. పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న , జొన్న, చిరుధాన్యాలు సాగుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలమందారెడ్డి, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ ఎన్ అక్షరాణి మౌనిక, శేషు నందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలలో నిబంధనలు పాటించాలి

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు విక్రయాల్లో కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజ్యలక్ష్మీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాకును, రికార్డులు పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు

మేదరమెట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు అందించాలని, ధరలు పెంచి బ్లాక్ మార్కెటింగ్ చేస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం మేదరమెట్లలోని ఎరువుల దుకాణాలను అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, కోరిశపాడు ఎస్ఐ సురేష్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల బ్లాక్‌మార్కెట్ విషయంలో కఠినంగా వ్యహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అహమ్మద్ పాల్గొన్నారు.

చేనేతల హామీలను నెరవేర్చాలి

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కమిటీ సమావేశం కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా, అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే ఉప వృత్తిదారుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గద్దె హేమసుందరబాబు, , ఐవీ.ప్రసాద్, రాధాకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలతో ఆరోగ్యం

అద్దంకిటౌన్, సెప్టెం బరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, 7వ నెల నుంచి అనుబంధ ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.ఇందిర సూచించారు. మంగళవారం మండ లంలోని కలవకూరు సెక్టర్ పరిధిలోని శంకవరప్పాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పోషకాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. సరైన సమయంలో ఆహారం ఇస్తే ఐక్యూ 85శాతం పెరుగుతుందన్నారు. మెదడు అభివృద్ధి 3 సంవత్సరాల పిల్లలకు 80శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు పెరుగుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తల్లులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న డీజీఎం సునీత

ఇంకొల్లు, సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి) : గ్రామసంఘాల ద్వారా పొందిన రుణాలను త్వరితగతిన రికవరీ చేసి ఈ నెల 10వ తేదిలోగా పురోగతి సాధించాలని వెలుగు డీజీఎం సునీత సూచించారు. ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామసంఘాలు సీసీలు గ్రామం సంఘ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. రికవరీ మొబైల్ యాప్ ద్వారా చెల్లించేందుకు సభ్యులకు కూడా అవగాహన కలిగించాలన్నారు. ప్రతి గ్రామ సంఘంలో నూరుశాతం రికవరీ జరిగేలా చూడాలన్నారు. సభ్యుల అవసరాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేసి జీవనోపాదులను పెంపొందించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు వెలుగు ఏపీఎం అనూరాధ, ఏజీఎం సతీష్, స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, సీసీలు, ప్రసన్నాంజనేయరెడ్డి, అశోక్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదినం

- ఉత్సాహంగా పాల్గొన్న జనసేన కేడర్, అభిమానులు
- పలుచోట్ల రక్తదాన శిబిరాల ఏర్పాటు



రక్తదాన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న నేతలు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పలు చోట్ల ఘనంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసైనికులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్‌లు నిర్వహించి, బాణసంచా కాల్చారు. కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో రక్తదానం చేశారు. నాయకులు వారికి సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో మామిడాల రాములు, గూడూరి శివరామప్రసాద్, మార్కండేయులు, లక్కాకుల లక్ష్మీ, బాలు, కిరణ్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేనికులు పండుగ వాతావరణంలో నిర్వహించారు. టీడీపీ, బీజేపీ శ్రేణులు వేడుకల్లో పాల్గొని మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన పర్చూరులో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపూడి విజయ్ కుమార్ పాల్గొన్నారు. తొలుత స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం స్థానిక బొమ్మల కూడలిలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ వైస్ ఛైర్మన్ శంకరశెట్టి చిరంజీవి, టీడీపీ మండల అధ్యక్షుడు విన్నకోట అజేయ్, కారంపూడి సందీప్ తేజ, దీర్ఘాల రమేష్ నాయుడు, తులసి చంటి, ఒగ్గిశెట్టి నరసింహం, శీలం కుమార్, బోగాది మోహన్, అచ్చికోలు సతీష్, కందా సురేంద్ర, తోట మణి తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మార్టూరులో పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు మందపాటి కిషోర్ కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్టూరు పట్టణ అధ్యక్షులు షేక్ వహీద్, జిల్లా సంయుక్త కార్యదర్శి వేముల శ్రీనివాసరావు, కొండపల్లి కాశిలింగం, కందుల ప్రేమ్‌కుమార్, నాగరాజుపల్లి గ్రామ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం : జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే.పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడవకుదురు, సోపిరాలలోని పార్టీ కార్యాలయాల వద్ద, సోపిరాల రంగాసెంటర్ వద్ద, సంతరావూరు గ్రామంలో డి.పవన్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు పవన్ కల్యాణ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. సంతరావూరు గ్రామంలో పలుచోట్ల కూటమి నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తుమ్మలపెంట సీతారామయ్య, మోటుమర్రి రామసుబ్బారావు, టీ.జయరావు, టి.ఆదినారాయణ, దేవతోటి నాగరాజు, మహేష్, హరి, ఆంజనేయులు, సాయి, శంకర్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లులో జనసేనపార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్తూపం సెంటర్‌లో పర్చూరు నియోజకవర్గం జనసేనపార్టీ నాయకులు మన్నెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం డొక్కాసీతమ్మ పేరున శ్రీకాంత్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంకొల్లు మండల కమిటీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.







పర్చూరులో రక్తదాన శిబిరంలో పాల్గొన్న పెద్దపూడి విజయ్, మార్టూరులో రక్తదానం చేస్తున్న యువకులు, చినగంజాంలో కేకు కట్ చేస్తున్న నాయకులు

మహిళల రక్షణపై అవగాహన

- ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ చర్యలు
- శక్తి యాప్‌తో రక్షణ మార్గాలు



విద్యార్థులకు ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తేజస్కూల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై స్వయంగా ఆత్మరక్షణ విద్యతో కూడిన అవగాహన కల్పించి ఉత్సాహ పరిచారు. అంతేకాకుండా శక్తి యాప్‌పై వినియోగంపై అవగాహన కల్పించారు. యాప్ ఇన్ స్టాల్ చేశాక ప్రమాదకర మైన సమయంలో యాప్ ఓపెన్ చేసి షేక్ చేస్తేనే పోలీసులకు అర్జెంట్ అలర్ట్ చేరుతుంది. ఏ ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ వివరాలు అందుబాటులో ఉంటాయి. ఎమర్జెన్సీ కాలింగ్ నెంబర్‌లు 100, 112 తక్షణ కాల్ సదుపాయం. లైవ్ ట్రాకింగ్ తేలికగా పోలీసులకు చేరుతుంది. ప్రయాణభద్రత సమాచారం పోలీసులకు అందుబాటులో ఉండటం వలన ధైర్యంగా ప్రయాణాలు సాగించవచ్చని ఎస్సై వివరించారు.

ఆవుకు అరుదైన శస్త్రచికిత్స

ఆవు, దూడ ప్రాణాలు కాపాడిన పశువైద్యుడు





క్షేమంగా ఉన్న ఆవుదూడ, వైద్యం చేసిన డాక్టర్ ఆనంద్

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :ఆవు ప్రసవ సమయంలో సమస్య తలెత్తడంతో శస్త్రచికిత్స ద్వారా సమస్యను సరిచేసి ఆవు, దూడలను కారంచేడు పశు వైద్యుడు ఆనంద్ కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం కారంచేడు గోశాలలో ఆవు దూడకు జన్మనిచ్చే సమయంలో గర్భాశయం దూడతోపాటు బయటకు వచ్చింది. దీంతో ఆవు ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. సమాచారం అందుకున్న పశువైద్యుడు ఆనంద్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి వెన్నుపూసకు మత్తు ఇచ్చి బయటకు వచ్చేసిన గర్భాశయాన్ని శుభ్రపరిచి అరుదైన శస్త్రచికిత్స చేసి ఆవులో యధాతథంగా ప్రవేశపెట్టారు. దీంతో ఆవు కోలుకోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు గంటలకు పైగా పశువైద్యుడు ప్రాణాలు కాపాడేందుకు శతవిధాలా శ్రమించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పశువైద్యుడిని అభినందించారు. ప్రస్తుతం ఆవుతోపాటు, దూడ ఆరోగ్యంగా ఉన్నాయి.

ఆకట్టుకుంటున్న వినాయక నిమజ్జనాలు



విభిన్న వేషధారణలో కళాకారులు

మార్టూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు ఎంతో ఉత్సాహంతో మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకునికి పూజలు చేస్తున్నారు. వీధులలో మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా విగ్రహం వెంట నడుస్తూ విడ్కోలు పలుకుతున్నారు. స్థానికంగా నేతాజీనగర్‌లో మంగళవారం వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నుంచి ప్రత్యేకంగా పిలిపించిన యువకులు దేవతామూర్తులు, రాక్షస గణాలు వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లడ్డును అద్దేటి ఏడుకొండలు రూ.80,016లకు వేలంలో దక్కించుకున్నాడు. స్థానిక కన్యకా పరమేశ్వరి అ మ్మవారి ఆలయంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో మహిళలు ప్రత్యేక వస్త్రధారణతో ఊరేగింపులో పాల్గొన్నారు. అదేవిధంగా నేతాజీ నగర్ లో బోసు ఆధ్వర్యంలో మరో వినాయకుని నిమజ్జన కార్యక్రమం సందడిగా నిర్వహించారు.

పొదుపు మహిళలు జీవనోపాధిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలలో ఉన్న మహిళలు ఏదో ఒక యూనిట్‌ను పెట్టుకొని జీవనోపాధిని పెంచుకోవాలని డీఆర్‌డీఏ జిల్లా పీడీ కే.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం బల్లికురవ వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన పొదుపు సంఘాల ప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలకు రాయితీపై ప్రభుత్వం గేదేలు, గొర్రెలు, కోళ్ల, గడ్డి పెంపకం, అరకు కాఫీ, షేడ్‌నెట్స్ యూనిట్లు పెట్టుకోనేందుకు రుణాలను అందజేస్తోందన్నారు. అలానే ప్రతి గ్రుపునకు రూ.20 లక్షల మేర బ్యాంకు లింకేజీ రుణాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలానే ఇంకా ఎవరైన సంఘాలలో నమోదు కాకుంటే వెంటనే కొత్త గ్రుపులను ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఐబి డీపీఎం రవికుమార్, ఏపీఎం రాజారావు, సీసీలు పేరయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : ప్రతి డ్వాక్రా మహిళను వ్యాపారవేత్తగా తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినట్లు జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఇచ్చే రుణాలు వారు చేసుకునే వృత్తిపరంగా, గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, పొట్టేళ్ల పెంపకం, కుట్టు మిషన్‌లు, బట్టల షాపు, అరకు టీ సెంటర్‌లు వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. అలాగే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాలను నూరుశాతం రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రవి కుమార్, ఏపీఎం హనుమంతరావు, స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాస్, ఎల్‌సీ విజయ్‌భాస్కర్, మండల సమైక్య అధ్యక్షురాలు నాగభోతు సుజాత, కోశాధికారి లీలావతి, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ వర్ధంతి



చీరాలలో నివాళి అర్పిస్తున్న వైసీపీ నాయకులు

చీరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల గడియార స్థంభం కూడలిలో మంగళవారం ఘనంగా వైఎస్‌రాజశేఖరరెడ్డి వర్థంతిని నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడకల్లో పెద్దఎత్తున వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

అద్దంకి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో వైయస్ విగ్రహానికి వైసీపీ, కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ నేతలు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాణెం నరశింహారెడ్డి, శ్రీని వాసరెడ్డి, జ్యోతి హనుమంత రావు, కాకాని రాధాకృష్ణమూర్తి, గుంజి కోటేశ్వరరావు, బాలు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి అడుసుమల్లి కిషోర్, పీసీసీ సభ్యులు కోరే సురేంద్రనాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత బొమ్మల కూడలిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోటా శ్రీనివాసరావు, కఠారి అప్పారావు, బండారు ప్రభాకర్, ముప్పాళ్ళ రాఘవయ్య, యద్దనపూడి హరిప్రసాద్, తోకల కృష్ణమోహన్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు మలుపులో నిలిచిన గ్రానైట్ లారీ

- పక్కనే విద్యుత్ స్తంభం ఉండడంతో బాటసారుల ఆందోళన



బల్లికురవ-నాగరాజుపల్లి గ్రామాల మధ్య రోడ్డు మలుపులో కుంగిన లారీ

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బల్లికురవ మార్టురు అర్‌అండ్‌బీ రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతింది. దీంతో గ్రానైట్ ముడి రాయి రవాణా సమయంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మంగళవారం వీర్లకొండ నుంచి మార్టురు గ్రానైట్ ఫ్యాక్టరీలకు వెళుతున్న ముడిరాయి లారీ నక్కబొక్కలపాడు పోలిమేర డొంక వద్ద ఉన్న మలుపులో గోతులలో ముందుకు కదలలేక కురుకుపోయింది. పక్కనే విద్యుత్ స్తంభం ఉండడంతో లారీపై ఉన్న రాళ్ల స్తంభంపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని బాటసారులు ఆందోళనకు గురయ్యారు. మలుపులో లారీ నిలిచి పోవడంతో ఈ మార్గంలో కొంత సేపు రాకపోకలు నిలిచి పోయాయి. పెద్ద పెద్ద గోతులు కావడంతో ముడిరాయి లారీలు రాకపోకలకు తీవ్రఇబ్బందిగా మారిందని వాహనాల చోదకులు వాపోతున్నారు. అధికారులు వెంటనే ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులను పూడ్చించే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబపూడి గ్రామంలో మంగళవారం గుంటూరుకు చెందిన కాటూరి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. వైద్యులు హర్షవర్ధన్, ఆషీకా, పూజిత, అమీనా, కల్పన, సురేంద్ర, శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, చర్మ వ్యాధులు, కంటి పరిక్షలు, స్త్రీలకు పరీక్షలు, చెవి ముక్కు వంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాలలో తాము వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి సహకారం అందించిన గ్రామ పెద్దలు దద్దాల అంజయ్య, గంగవరపు నాయుడులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల మేనేజర్ రాంబాబు, శివరామకృష్ణ, శ్రీనాథ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా వీరాంజనేయులు



వీరాంజనేయులు (ఫైల్)

బల్లికురవ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న గాలం వీరాంజనేయులు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. బల్లికురవ మండలం వైదన గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వీరాంజనేయులు 17 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, కోటవారిపాలెం, మల్లాయపాలెం గ్రామాలలో పనిచేసి ఉన్నారు. తాజాగా ఇటీవల జరిగిన బదిలీలలో కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు గ్రామాలలో తన వంతు సేవా కార్యక్రమాలు కూడా చేయడంతో ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబరు 5న ఆయన అవార్డును అందుకోనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురి ఎంపిక


వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలంలో బోధన అందిస్తున్న పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికయ్యారు. వీరిలో వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినీగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి, బూసం లలితాంబ, వడ్డె సంఘం ఎంపీపీ పాఠశాలకు చెందిన పోపూరి రంగారావు, నాయనిపల్లి(ఈస్ట్) ఎంపీపీ పాఠశాలకు చెందిన తెలగతోటి ఇందిర అవార్డులకు ఎంపికైనట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో వీరు వచ్చే శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. దీంతో వీరిని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి



డోరును తొలగిస్తున్న ఎస్సై పట్టాభిరామయ్య

సంతమాగులూరు సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్టా వారి పాలెం అడ్డరోడ్డు సమీపంలో అద్దంకి -నార్కెట్‌పల్లి రహదారిపై మంగళవారం రాత్రి ముందు వెళుతున్న లారీని, వెనుకాలే వస్తున్న ఐచర్ లారీ ఢీకొట్టింది. దీంతో ఐచర్ లారీ డ్రైవర్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆర్ మురుగన్(36)కు తీవ్రగాయాల య్యాయి. టోల్‌గేట్ అంబులెన్స్ వాహనం ద్వారా నరసరావుపేటకు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రహదారిపై ముందుగా వెళుతున్న లారీ ఒక్కసారిగా స్లో కావడంతో వెనుకాల లారీ ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ మురుగన్ స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయాడు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్ ఐ పట్టాభిరామయ్య, సిబ్బంది డోర్లు పగలగొట్టి మురుగన్‌ను బయటికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అమరజీవికి నిలువెత్తు గౌరవం



పిల్లర్లకు పరిమితమైన స్మారక భవనం అదనపు గదులు

- అమరావతిలో కాంస్య విగ్రహం, మ్యూజియం, స్మృతివనం
- పనులకు నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- పొట్టి శ్రీరాములు నడయాడిన జువ్వలదిన్నె బాగుపడేనా!?
- నాడు రూ.100 కోట్లతో పనులకు శంకుస్థాపన
- పూర్తిగా నీరుగార్చిన వైసీపీ సర్కారు
- ప్రస్తుత ప్రభుత్వంపై చిగురిస్తున్న ఆశలు

బిట్రగుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం ఇచ్చింది. అమరావతిలోని 6.8 ఎకరాల సువిశాల స్థలంలో పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహం, మ్యూజియం, ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో బుధవారం శంకుస్థాపన జరగనుంది. అమరజీవికి టీడీపీ హయాంలోనే గౌరవం దక్కుతోందని పొట్టి శ్రీరాములు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరజీవి నడియాడిన బోగోలు మండలం జువ్వలదిన్నెలో పలు అభివృద్ధి పనులకు కూడా చంద్రబాబునాయుడే శంకుస్థాపనలు చేశారని గుర్తు చేసుకుంటున్నారు. 2019, జనవరి 11వ తేదీన అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించి జువ్వలదిన్నెలో పలు శంకుస్థాపనలు చేశారు. తీరప్రాంత మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సుమారు రూ.282 కోట్లతో పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ ఐదేళ్లలో పనులు ముందుకు సాగలేదు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెండింగ్ పనులపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణం, మంచినీటి ప్రాజెక్ట్, సోలార్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అలాగే తీరప్రాంత ప్రజల విద్యాభ్యాసానికి ఆదర్శ ఉన్నత పాఠశాల నిర్మించాలన్న చంద్రబాబు కలను వైసీపీ ప్రభుత్వం నీరుగారుస్తూ పుట్టింగులకే పరిమితం చేసింది. సీజనల్ వ్యాధులు తీవ్రంగా విస్తరించే తీరప్రాంత ప్రజల ఆరోగ్య అవసరార్థం పీహెచ్‌సీ నిర్మాణానికీ వైసీపీ పాలకులు స్థలం కేటాయించలేదు. పొట్టిశ్రీరాములు స్మారక అదనపు గదుల నిర్మాణం పిల్లర్ల దశ దాటలేదు. ఈ పరిస్థితుల్లో తీరప్రాంత అభివృద్ధి, గంగపుత్రుల దాహార్తి తీర్చే విషయంలో కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి అడుగులు వేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయ్యాక సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయించాలన్న ఆలోచనలు జరుగుతున్నాయి.



2019లో చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన పొట్టి శ్రీరాములు విగ్రహం

'పీఎం యశస్వి'కి 15 వరకు గడువు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పీఎం యశస్వి పథకం కింద ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 15 వరకు గడువును పొడిగించారని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి పీ వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద టాప్‌క్లాస్ స్కూళ్లు, కాలేజీల కింద ఎంపిక చేయబడిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు రూ.75వేలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25లక్షల స్కాలర్‌షిప్ అందిస్తారని తెలిపారు. జిల్లాలో 2.50లక్షలలోపు వార్షికాదాయం కలిగిన బీసీ, ఓబీసీ, మైనార్టీ, డీఎన్‌టీ విద్యార్థినీ విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జిల్లాలో ఎడగారు వరి పంట కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. అల్పపీడన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో అన్నదాతలో గుబులు మొదలైంది. అన్నదాతలతోపాటు రైతు సంఘాల నాయకులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని కోరుతున్నా వారి విన్నపాలను పాలకులు పట్టించుకోవటం లేదు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

'కోత'లు మొదలైనా..
కొనుగోళ్లు ఏవీ!?

- 'ఎడగారు'లో విస్తృతంగా వరి సాగు
- ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- మొదలైన కోతలు.. భయపెడుతున్న వాతావరణం
- ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసేది!?
- నివేదిక పంపి మిన్నకుండిపోయిన అధికార యంత్రాంగం
- ఇదే అదునుగా దళారుల రంగప్రవేశం..
- వారు చెప్పిన రేటుకే కొనుగోలు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాత



కోతల అనంతరం ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుతున్న యంత్రం

ఎడగారు సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకపోవటంతో రైతులు విస్తృతంగా వరి సాగు చేపట్టారు. 98 వేల ఎకరా లలో సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేసినా 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగయినట్టు తెలుస్తోంది.. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క గట్టారు. ఇందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువగా కేఎన్‌ఎం-1638 వరి రకం సాగుచేశారు. నెల్లూరు రూరల్, బుచ్చి, జలదంకి, అల్లూరు, వెంకటాచలం, కొడవలూరు, తోటపల్లిగూడూరు ఇందుకూరు పేట తదితర ప్రాంతాల్లోని 1.64 లక్షల ఎకరాల్లో ఈ రకం వరి సాగుచేశారు. ఎంటీయూ 1010 రకం 20 వేల ఎకరాల్లోను, 1790 ఎకరాల కుపైగా కేఎన్‌ఎం-733, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలను సాగు చేశారు.

● దళారుల రంగ ప్రవేశం

బుచ్చి, నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, అల్లూరు తదితర చోట్ల వరి కోతలు మొదలయ్యాయి. అప్పుడే దళారులు రంగప్రవేశం చేసి గిట్టుబాటు ధర కన్నా తక్కువకు ధాన్యం కొనుగోలు చేయను సన్నద్ధమైనట్లు సమాచారం. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు సాధారణ రకానికి రూ.2300, గ్రేడ్-ఏ రకానికి రూ.2320 గా ఉంది. ఈ లెక్కన పుట్టి ధాన్యం ధర రూ.19,720గా ఉంది. ప్రభుత్వం తరఫున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఈ మద్దతు ధర రైతులకు లభిస్తుంది. కోతలు మొదలైనా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు కలిసి వస్తోంది. ఎంటీయూ 1010 రకం పుట్టి ధాన్యాన్ని రూ. 15 వేల నుంచి 15,500లకు దళారులు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. వర్షాలు కురిస్తే ఈ ధరను మరింత దిగజార్చే అవకాశం ఉంది.

● ప్రతిపాదనలతో సరి

జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా యంత్రాంగం తరఫున 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇందుకోసం 125 కేంద్రాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఆ తరువాత రైతుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి వారు తీసుకెళ్లలేదనే విమర్శలు ఉన్నాయి. మిల్లర్లతో సమావేశాలు జరుగు తూనే ఉన్నాయి. రైతుల గోడుగోడుగానే మిగిలిపోయింది. ఇకనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో వేచిచూడాల్సిందే.

అనుమతి రాగానే ప్రారంభిస్తాం

జిల్లాలో ఎడగారు పంట వివరాలు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయం ప్రభుత్వానికి తెలియచేశాం. కేంద్రాల ఏర్పాటు, కొనుగోళ్లకు సంబంధించి అనుమతి రాగానే కొనుగోలు ప్రారం భిస్తాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

- అర్జునరావు, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

బార్‌ల బేజారు!

- జిల్లాలో 55కి 21 బార్‌లకే దరఖాస్తులు
- నూతన పాలసీపై వ్యాపారుల్లో అసహనం
- జిల్లాలో మూతపడుతున్న బార్‌లు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అప్పటి పాలకుల పుణ్యమా అని ఓ వెలుగు వెలిగిన బార్‌లు ఇప్పుడు మూతపడుతున్నాయి. ఇందుకు ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీ ప్రభావమేనని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా 55 బార్లకు గజిట్ విడుదల చేయగా 21 బార్లకు 94 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో ప్రభుత్వానికి దరఖాస్తుల రూపేణా ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. ప్రధానంగా నెల్లూరు నగరం వంటి ప్రాంతాల్లో 35 బార్లకు గజిట్ విడుదల చేసినా 17 బార్లు మాత్రమే దరఖాస్తులు అందడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకప్పుడు బార్‌లకు దరఖాస్తులు చేసుకోవడమంటే వ్యాపారులు పోటీపడేవారు. అయితే, ప్రస్తుతం వారిలో చలనం కరువైంది. టెండర్, వేలం కాకుండా ఈ సంవత్సరం బార్లను లాటరీ విధానంలో కేటాయించినా ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు కంటే ఎక్కువ అందలేదు.

● పాలసీలో మార్పులు వచ్చేనా!?

నూతన బార్ పాలసీలో కొన్ని మార్పులు చేయాలని దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాక ముందు నుంచే వ్యాపారులు కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం అంగీకరించకపోవడంతో వ్యాపారులంతా చర్చించుకొని దరఖాస్తుల ప్రక్రియకు దూరంగా ఉన్నారు. అయితే, దరఖాస్తుల ప్రక్రియలో చివరి రోజున కొందరు వ్యాపారులు ముందుకు వచ్చి ఒక్కో బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వేశారు. దీంతో జిల్లాలో గీతకులాలతో కలిసి 21 బార్‌లకు లక్కీడిప్ నిర్వ హించారు. నూతన పాలసీలో మార్పులు తీసుకువస్తే అన్ని బార్లకు దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాపా రులు చెబుతున్నారు. కొద్ది రోజుల్లోనే మరో నోటిఫికేషన్ విడుదల అవుతుందని, జిల్లాలో మిగిలి ఉన్న బార్లకు దరఖాస్తులు చేసుకునే అవాకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.





నెల్లూరులో మూతపడ్డ బార్‌లు

మీకు చెక్‌పవర్ ఎందుకు రద్దు చేయకూడదు!

వెంకటాచలం సర్పంచుకు డీపీవో నోటీసు

వారం రోజుల వరకు గడువు 8

ఖబడ్దార్ క్రిమినల్స్!

- తరచూ నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్
- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తరచూ నేరాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తున్నామని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రౌడీ, కేడీ, బీసీల ప్రవర్తనలో మార్పు రాకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పదేపదే నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, పీడీ యాక్ట్ అమలు చేస్తే జైలు జీవితం తప్పదన్నారు. అవసరమైతే జిల్లా నుంచి బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడ బోమని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీ నేరస్తుడిపై నిరంతరం పటిష్ఠ నిఘా ఉంటుందని తెలిపారు. కాగా, నెల్లూరులోని వెంకటేశ్వరపురం జగనన్న కాలనీలో నివసిస్తున్న షేక్ తన్వీర్‌పై పీడీ యాక్ట్‌ను జిల్లా పోలీసులు అమలు చేశారు. గతంలో వేదాయపాళెం పరిధిలోని చంద్రబాబునగర్‌లో తన్వీర్ నివాసం ఉండే వాడు. అతనిపై ఒక హత్యాయత్నం, మూడు దోపిడీ, ఒక దొంగతనం... ఇలా మొత్తం 11 కేసులున్నాయి. వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు.

మద్యం కేసు.. నీరుగార్చే యత్నం?

ప్రభుత్వం మారి ఏడాది దాటినా ఇంకా కొందరు అధికారుల తీరు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండ చూసుకొని విచ్చలవిడిగా వ్యవహరించిన కొందరు అధికారులు.. ఇప్పుడు ఆ బాగోతాలు బయటకు రాకుండా మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల సమయంలో మద్యం బాటిళ్లు పక్కదారి పట్టించి వైసీపీ నేతలకు చేరవేసిన కేసును ఎలాగైనా నీరు గార్చాలన్న కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ అధికారి కేసు ముందుకు సాగకుండా ఉండేందుకు తన పలుకుబడి మొత్తాన్ని ఉపయోగించుకుంటున్నట్లు ఎక్సైజ్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- గతేడాది ఎన్నికలలో భారీగా మద్యం పక్కదారి
- వైసీపీ నేతల చేతుల్లోకి లక్షల బాటిళ్లు
- సర్వేపల్లి వ్యవహారంతో గుట్టు రట్టు
- కీలకంగా వ్యవహరించిన ఓ అధికారి
- నేడు విచారణ ముందుకు సాగకుండా విశ్వప్రయత్నం
- రెండు నెలల నుంచి ఎక్సైజ్‌కు అందని డేటా

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో పొదలకూరు మండలం విరువూరు, ముత్తుకూరు మండలం పంటపాలెం వద్ద ఇద్దరు వైసీపీ నేతల వద్ద భారీగా మద్యం డంప్‌లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఆ కేసుల్లో వైసీపీ నేతలను అరెస్టు కూడా చేశారు. అప్పట్లో పనిచేస్తున్న అధికారులు లోతైన విచారణ జరపకుండా కేసును క్లోజ్ చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ వ్యక్తి ఈ కేసులపై కోర్టును ఆశ్రయించారు. దీంతో మళ్లీ కేసుల పునఃవిచారణ ప్రారంభమైంది. ఈ కేసులతో సంబంధం ఉందన్న అభియోగంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు కూడా చేశారు. పునఃవిచారణలో ఎన్నికల సమయంలో జరిగిన మద్యం కుట్ర బయట పడింది. వైసీపీ నేతల వద్ద దొరికిన మద్యం కేస్‌లన్నీ ప్రభుత్వ దుకాణాల నుంచే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇవేగాక మరింత భారీ స్థాయిలో ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం బయటకు వెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న 35 దుకాణాల్లోని నాటి అమ్మకాల రికార్డులను పరిశీలించగా 2024, మార్చి మొదటి వారంలోని రెండు రోజుల్లోనే సాధారణ అమ్మకాలకు మించి మద్యం అమ్మకాలు జరిగినట్లు గుర్తించారు. ఒక్కో షాపులో సాధారంగా రోజుకు వెయ్యి బాటిళ్ల మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఆ రెండు రోజుల్లో

- మిగతా 8లో



కార్పొరేషన్‌లో 'ఓసీ' కలకలం!

- 72 అపార్టుమెంట్లకు మార్టిగేజ్‌ల విడుదల
- భారీ స్కాంలో నాటి కమిషనర్‌లే కీలకం
- చర్యలకు టీడీపీ నేత ఆనం డిమాండ్

నెల్లూరు మున్సిపాలిటీలో మరో అవినీతి బాగోతం

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 2,(ఆంధ్రజ్యోతి) : అవినీతి స్కాంలకు కేంద్ర బిందువుగా మారిన నెల్లూరు కార్పొరేషన్‌లో తాజాగా మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఏపీ ఆక్వా అథారిటీ బోర్డు చైర్మన్, టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి ఫిర్యాదుతో సిటీ ప్లానింగ్‌లో తీగలాగగా అవినీతి డొంకంతా కదిలింది. గడిచిన వైసీపీ హయాంలో నెల్లూరు నగరంలోని 72 అపార్టుమెంట్లకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ (ఓసీ) లేకుండానే మార్టిగేజ్‌లు విడుదల చేసిన భారీ అవినీతి స్కాం బయటకు వచ్చింది. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులైన కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని ఆనం డిమాండ్ చేస్తూ మంగళవారం కమిషనర్ నందన్ కలిసి వినతి పత్రం అందచేశారు. ఆ వివరాలు మేరకు.. వైసీపీ హయాంలో కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్ విభాగం అవినీతితో భ్రష్టుపట్టిందని తెలిపారు. 72 అపార్టుమెంట్లకు కనీస క్షేత్రస్థాయి విచారణ కూడా లేకుండా ఓసీ విడుదల చేయకుండానే మార్టిగేజ్ ధ్రువీకరణ ఇచ్చేశారని తెలిపారు. ఇందులో అప్పటి కమిషనర్లుగా పని చేసిన డీ హరిత, వికాస్‌మర్మత్, ప్రస్తుత డీసీ చెన్నుడు కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. తాను మే నెలలో

- మిగతా 8లో

పంచకర్మ చికిత్సలో అందిస్తున్న శిరోధార ప్రక్రియ



ఆయుర్వేదానికి అందలం

మొండి జబ్బులను కూడా నయం చేసే పురాతన వైద్య విధానం ఆయుర్వేదం. ఇంగ్లీష్ మందుల హోరులో వెనుకబడి పోయిన ఆ ఆయుర్వేదానికి పూర్వవైభవం తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆసుపత్రులను అభివృద్ధి చేయడమేకాక అధునాతన సేవలు, పంచకర్మ వంటి ఖరీదైన చికిత్సలనూ అందించేందుకు కసరత్తు చేస్తోంది.

- ప్రాచీన వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యం
- అందుబాటులోకి పంచకర్మ చికిత్సలు
- వెల్‌నెస్ సెంటర్లుగా 8 ఆసుపత్రులు
- వైద్యులు, సిబ్బంది నియామకానికి అనుమతులు

జిల్లా వ్యాప్తంగా 25 ఆయుర్వేద ఆసుపత్రులు ఉన్నప్పటికీ వాటిని వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. నెల్లూరులోని ప్రధాన ఆయుర్వేద ఆసుపత్రిలోనూ తగినంత మంది వైద్యులు లేరు. తాత్కాలికంగా వేరే ఆసుపత్రి నుంచి మూడు రోజులు వచ్చి సేవలు అందిస్తున్నారు. అల్లూరు లో 5 పడకల ఆసుపత్రి ఉన్నా వైద్యులు, సిబ్బంది లేకపోవటంతో ఆ కేంద్రం ఎప్పుడూ మూసే ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యులు, సిబ్బంది భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలోని ఆయుర్వేద ఆసుపత్రులకు 40 మంది వరకు వైద్యులు, సిబ్బంది నియామకాలు జరుగనున్నాయి.

వివరాలు 8లో...

'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 23,031 క్యూసెక్కుల వరద రాగా, మంగళవారం 19,745 క్యూసెక్కులకు పడిపో యింది. ఇక డ్యాంలో 63.330 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,100, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో.. రాపూరు : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.080 క్యూసెక్కులు నిల్వ ఉన్నట్లు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 9,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,425 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 570

కందుకూరులో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న చిన్న చిన్న మెకానిక్ షాపులు, వెల్డింగ్ వర్క్‌లు, ఇతర చిన్న వ్యాపారులంతా ఒకే ప్రదేశంలో ఉండేలా ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కందుకూరులో వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ ఏర్పడిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఇస్లాంపేట షాదీఖానాలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆనందపురం గ్రామం సర్వేనెం. 1719లో 100 ఎకరాల ప్రభుత్వభూమి ఉందని దానిని చిన్న వ్యాపారుల కోసం కేటాయించే దిశగా జిల్లా కలెక్టరుతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్‌గఫూర్, షేక్ చాంద్‌బాషా , కమిటీసభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

13న లోక్ అదాలత్

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటారువాహనాలు, భరణం తదితర కేసులను రాజీచేసుకో వచ్చునని తెలిపారు.

డిగ్రీ విద్యార్థినికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

జలదంకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న జలదంకికి చెందిన డిగ్రీ విద్యార్థిని కరిష్మాను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరామర్శించారు. విద్యార్థిని తల్లిదండ్రులు మాబాషా, నూర్జహాన్‌ల నుంచి ఆమె ఆరోగ్య విషయం తెలుసుకుని ప్రభుత్వం తరుపున వైద్యసహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పులుగుంట మధురెడ్డి, గంటా అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం వృద్ధి

ఉలవపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో భూసారం వృద్ధి చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మన్నేటికోటలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పంటలకు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలుగా 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు సాగు చేసుకోవచ్చన్నారు. పీఎండీఎస్ విత్తనాలను ప్రధాన పంటకు 50 రోజుల ముందు భూమిలో చల్లి 45వ రోజుల తరువాత కలియదున్నాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బం ది సునీత, రమేష్, వంశీ, అరుణ, రాజా, ప్రియాంక పాల్గొన్నారు.

మోపాడులో 'పొలం పిలుస్తోంది'

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో అబ్దుల్‌రహీం, కేవీకే శాస్త్రవేత్త వెంకటేష్‌లు గ్రామంలో సాగుచేసి ఉన్న వరిపైరును పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగ తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోకూరు, బడేవారిపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చరణ్, సాయి, ఆఫ్రీన్ రైతులు పాల్గొన్నారు.

కాండ్ర కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం చెరువు మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు కాండ్ర గోవర్ధన్‌నాయుడు సతీమణి కాండ్రరత్నమ్మ (65) మృతి చెందడంతో మంగళవారం పలువురు నేతులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధుబాబునాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులుయాదవ్, చిలకపాటి వెంకటేశ్వర్లు, జీ.నాగరాజు. పీ.సుబ్బారావు, టీ.వేణుగోపాల్, తదితరులు రత్నమ్మ భౌతికకాయానికి పూలమాలు వేసి నివాళులర్పించి ఆమె అంత్యక్రియలో పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కావలి(టౌన్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : రామస్వామి ఆసుపత్రి అధినేత డాక్టర్ మంచిగంటి రామస్వామి తన సతీమణి జ్ఞాపకార్థం 200 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలు గిరిజన ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను రామస్వామి కుమారుడు, కోడలు వెంకట్‌సౌరవ్, రక్షణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు జీ సురేంద్ర, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, రత్నమ్మ ఫౌండేషన్ చైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

లార్వా, ఫీవర్ సర్వే సక్రమంగా చేయాలి

కలిగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మంగళవారం సందర్శించారు. స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి సమక్షంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి లార్వా, ఫీవర్ సర్వేను విధిగా చేయడంతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో ల్యాబ్ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు


కావలి రూరల్ : నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


కావలి : లడ్డూను తీసుకెళుతున్న భక్తుడు


కావలి టౌన్ : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కావలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. 7 రోజుల పూజల అనంతరం వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వా హనాల్లో స్వామి వారిని ఉంచి మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం స ముద్ర తీరంలో నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమా ల్లో భాగంగా మహిళలు, చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతు లు అందజేశారు. తుమ్మలపెంట బలిజపాలెం లో స్వామివారి లడ్డూకు వేలం నిర్వహించగా రూ.65,000 పలికింది. రూరల్ సీఐ రాజేశ్వరరావు, సిబ్బంది, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● **కావలి :** వినాయణ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజావీధిలో గణేష్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద నిమజ్జనం సందర్భంగా మంగళవారం గణేష్ లడ్డూకు వేలం నిర్వహించారు. రైస్‌మిల్ వ్యాపారి తుమ్మల రాజేష్ రూ.3,01,000లకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ లడ్డూ తనకు దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని రాజేష్ ఆనందం వ్యక్తం చేశారు.

● **కావలి(టౌన్) :** పట్టణంలోని కలుగోళ

కోలాహలంగా ఊరేగింపులు
పోలీసుల విస్తృత బందోబస్తు

శాంభవీ ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణం వెలుపల భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 108 మంది యువతీ యువకులచే శ్రీవిష్ణు వివాహ ప్రాప్తి కొరకు కాత్యాయినీ వ్రతం నిర్వహించారు. రాత్రి 8గంటలకు దశ హారతుల కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జానపద గేయాల కార్యక్రమం అలరించింది. మలిశెట్టి మాట్లాడుతూ బుధవారం సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యా ణ మహోత్సం జరుగుతుందని, గురువారం ఉదయం ఉట్టి కార్యక్రమం, 4గంటలకు లడ్డూ వేలం పాట అనంతరం సాయంత్రం 5 గంటలకు 108 మంది చిన్నారుల జ్యోతులతో గణేష్ మహరాజ్ గ్రామోత్సవం, నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

● **కొండాపురం :** వినాయకచవితి సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు మంగళవారం నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెంలో కొలువైన వినాయక విగ్రహానికి భక్తులు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి


వలేటివారిపాలెంలో బుర్రాను సన్మానిస్తున్న వైసీపీ నేతలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. వలేటివారిపాలెం వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం అధ్యక్షతన మంగళవారం జరిగిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బుర్రాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుత్తా గోపి, నాగిరెడ్డి శివరామిరెడ్డి, పొట్టేళ్ల క్రిష్ణయ్య, నల్లమోతు చంద్రమౌళి పాల్గొన్నారు.

● **జలదంకి :** జలదంకి బస్టాండు కూడలిలో, గ్రామచావిడి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసీపీ మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, మాజీసర్పంచు తిప్పారెడ్డి ఇందిరమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురే శేషారెడ్డి, దేవరపల్లి మధురెడ్డి, పేతురు, మదుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు :** స్థానిక పాతబస్టాండు కూడలి సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, ఉస్మాన్ షరీఫ్, మేడా మాధవ, తాండ్ర మల్లికార్జున, సురేష్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** మండల అధ్యక్షుడు నేటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి, పార్టీ కార్యాలయంలోని వైఎస్ఆర్ చిత్రపటానికి ఎంపీపీ పెన్నా కృష్ణయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర, పెరుగు అన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీ.తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచులు డీ.మల్లికార్జున, వంటల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు:** ఉలవపాడు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పోతురాజు, నాయకులు ధనకోటి, ప్రభాకర్‌రెడ్డి, కోటులింగం, మద్దసాని నవీన్, ఆదాం, మోహన్‌బాబు, నిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ధైర్యశాలి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి


అల్లూరులో రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, అళహరి సుధాకర్, బీద గిరిధర్

అల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రా ష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని, రాష్ట్ర అభివృద్ధి ప్రదాత ముఖ్య మంత్రి చంద్రబాబు అయితే, కూటమి నాయకుల్లో, కార్యకర్తల్లో ధైర్యం నింపే ధైర్యశాలి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం అల్లూరులో జనసేన పార్టీ మండల కన్వీనర్ కారుమంచి కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కార్యకర్తల నుండి దేశ ప్రధాని వరకు మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడని పేర్కొన్నారు. అనంతరం రక్తదాతల్ని అభినందించారు. అనంతరం మొక్కలు నాటి, ఆసుపత్రి సిబ్బందికి దుస్తులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. టీడీపీ నేత బీద గిరిధర్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజా హృదయాల్లో స్థానం సంపాదించుకున్న నేతగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, టీడీపీ, జనసేన నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణ చైతన్య, బండి అమర్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట(ఆంధ్రజ్యోతి):** బోగోలు కూడలిలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసేన మండలప్రధాన కార్యదర్శి గంగపట్ల సురేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి జనసైనికులతో పాటు తెలుగు తమ్ముళ్ల కు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.శ్రీని వాసులు యాదవ్, మండల అధ్యక్షుడు వీ.శ్రీనివాసులు యాదవ్, జనసేన నియోజకవర్గ మత్స్యకార విభాగ అధ్యక్షు డు డాక్టర్ రవి, నేతలు ప్రభాకర్, ఫిలిప్, వెంకటేష్, మునుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు(ఆంధ్రజ్యోతి) :** పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఉలవపాడులో జనసైనికుడు వక్కల గడ్డ మణికంఠ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘ నంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పేరుతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనకులు, టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలక పాత్ర : ఇంటూరి


లింగసముద్రంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం లింగసముద్రంలోని బలిజపాలెంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన పవన్ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కూటమి నేతలు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు కూటమి ఏర్పాటులో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వడ్డెర కాలనీలో నిర్మించే రామాలయం నిర్మాణానికి అంగులూరి నరసింహారావు రూ.25 వేలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా కానీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.గురునాథం, నాయకులు గాలంకి ప్రసాద్, బింకం శేషయ్య, బింకం నాగేంద్ర, అడపా నర్సయ్య, యు నాగేశ్వరరావు, జంపాల శివప్రసాద్, కిలారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల వినియోగంపై మహిళలకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపై మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కేవీకే, అనంతపురంలోని దక్షిణక్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిచికారి డ్రోన్లు, పవర్ వీడర్లు, వివిధ రకాల నార్లు నాటే యంత్రాలు, విత్తనాలు విత్తే యంత్రాలు, వేరుశనగ కాయలు వలిచే యంత్రం, ఎరువులు, విత్తనాలు చల్లుకునే యంత్రాలపై అవగాహన కల్పించటంతో పాటు వాటి వినియోగంలో మెలకువలపై శిక్షణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్త వివేక్ కామత్, అనంతపురం నుంచి వచ్చిన శిక్షణ అధికారులు వెంకటరమణ, వెంకటేష్, భాస్కర్, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించం

కావలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిపై వైసీపీ నేతలు తమస్థాయిని మరచి అనుచిత వాఖ్యలు చేస్తున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తోందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, దేవరకొండ శ్రీనివాసులు, దావులూరి దేవకుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తన అనుచరులతో అనుచిత వాఖ్యలు చేయిస్తున్నారన్నారు. దళిత వర్గాలను అడ్డం పెట్టుకుని ఎక్కువగా వారి చేత మాట్లాడిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో దళితులపై దాడులు జరిగినప్పుడు వైసీపీలో ఇప్పుడు మాట్లాడుతున్న ఆ దళిత నేతలు అప్పుడు ఎక్కడకు పోయారన్నారు. ఒక మాజీ కౌన్సిలర్, కొంత మంది దళిత నేతలు తన గత చరిత్రను మరచి వారి స్థాయిని మించి ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు వల్లూరి కిరణ్, మేడికొండ సుకుమార్, అక్కిలగుంట సూర్యప్రకాష్, కమతం శ్రీనివాసు లు, నేలపాటి మాల్యాద్రి, పల్లపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పొగాకు'లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలిగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పొగాకు నారుమళ్లలో యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు బోర్డు పరిధిలోని శెట్టిపాలెం, పార్లపల్లి, సత్యవోలుఅగ్రహారం గ్రామాల్లో సాగు చేస్తున్న పొగాకు నారుమళ్లను ఆయన పరిశీలించారు. నారుమళ్ల సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పొగాకు బోర్డు అనుమతి పొందాలన్నారు. అనుమతులు లేకుండా నర్సరీలు సాగుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి పొగాకు సాగుచేస్తే సంబంధిత రైతుల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజరు జీ వెంకటేశ్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధించండి

లింగసముద్రం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని మండల స్థాయి మోనిటరింగ్ అధికారి గోపీకృష్ణ చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని చినపవని ప్రాథమిక, అన్నెబోయినపల్లి యూపీ, వీఆర్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును, ప్రాథమిక భాష, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వో-1 కే.మాల్యాద్రి, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

● **కొండాపురం :** మండలంలోని పలు పాఠశాలలను ఎంఈవోలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవో-1 కే.రవికుమార్ తూర్పు జంగాలపల్లి, ఉప్పలూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంఈవో-2 ఆనందరావు బోయళ్లవారిపాలెం, గుడవళ్లూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డుల్లో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.



యూరియా కోసం
రైతుల ఆందోళన

రైతుసేవా కేంద్రాల్లో యూరియా, ఇతరత్రా ఎరువులు అందుబాటులో ఉంచాలని మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి గ్రామంలో మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. వ్యవసాయ పనులు వదులుకుని యూరియా కోసం రైతులు ప్రదక్షణలు చేసినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. అవసరమైన ఎరువులు అందుబాటులో లేక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. - ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో
తహలీల్ ఫతేహ
ముగిసిన దొరసానమ్మ గంధ మహోత్సవం



స్థానిక హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి హబీబా ఖాతున్(దొరసానమ్మ) గంధ మహోత్సవంలో భాగంగా మంగళవారం తహలీల్ ఫతేహ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలోని సమాధులకు గంధ లేపనం చేశారు. అనంతరం ఖురాన్ పఠానం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు భక్తులు కీర్తనలు ఆలపించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంతో గంధమహోత్సవం ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. - ఏఎస్ పేట, (ఆంధ్రజ్యోతి)



ఆశా కార్యకర్తల సమావేశంలో సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ

మలేరియా నివారణకు చర్యలు

సంగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జిల్లాలో మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు పెరిగి మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు నివాస గృహ పరిసరాల పరిశుభ్రతతోపాటు నీటి నిల్వ ఉండకుండా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. జ్వరం రెండు, మూడు రోజులు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక కేంద్రాలను సంప్రదించి పరీక్షలు చేయించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, అశోక్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండక్కి వచ్చి పరలోకాలకు...
అదుపుతప్పి గేదెను ఢీకొన్న బైక్
యువకుడి మృతి



మస్తాన్‌బాబు(ఫైల్)

ఉదయగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి లేక కుటుంబ సమేతం గా పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతానికి వెళ్లి వినాయ చవితి పర్వ దినం సందర్భంగా స్వగ్రామానికి వచ్చి పరలోకాలకెళ్లిన సంఘ టన మంగళ వారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు... మండలంలోని మాసా యిపేట గ్రామానికి చెందిన పిడుగు మస్తాన్ బాబు(35)కు సీతారామపురం మండలం అయ్యవారిపల్లి పంచాయతీ గౌతం నగర్‌కి చెందిన వనజతో వివాహమైంది. మస్తాన్‌బాబు కటుంబ సమేతంగా బెంగళూరు వెళ్లి అక్కడ వీజీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించు కొని స్వగ్రామ మైన మాసాయిపేటకు కుటుంబ సమేతంగా వచ్చాడు. ఉత్సవం ముగిసిన అనంతరం మంగళవారం బెంగళూరు వెళ్లేందుకు రిజర్వేషన్ సైతం చేయించు కున్నాడు. ఈతరుణంలో భార్య, మరదలికి అనారోగ్యంగా ఉండడంతో మోటార్ బైక్‌పై ఉదయగిరికి వచ్చి వైద్యశాలలో చూపించి గ్రామంలో వదిలి పని నిమిత్తం తిరిగి ఉదయగిరికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం అయ్యవారిపల్లికి వెళుతుండగా మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా గేదే సైతం మృతిచెందింది. సమాచారం అందుకున్న ఉదయగిరి సీఐ వెంకటరావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీనులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృత దేహాన్ని ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. మస్తాన్‌బాబు మృతిలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఒక పాప ఉంది.

కార్పొరేషన్‌లో 'ఓసీ' కలకలం!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగు విచారణ కోరగా ఆ మేరకు కలెక్టర్‌కు అందిన ఆదేశానుసారం కార్పొరేషన్ అధికారులు విచారించి ఇటీవల కలెక్టర్, హైకోర్టుకు నివేదికను అందచేశారని తెలిపారు. ఓసీలు లేకుండా మార్టిగేజ్‌లు విడుదల చేసింది నిజమేనన్న వాస్తవాన్ని వారే ధ్రువీకరించారని స్పష్టం చేశారు. పైగా తదుపరి విచారణకు విజిలెన్స్‌కు సిఫార్సు చేయడం తగదన్నారు. కార్పొరేషన్ అధికారులే అక్రమాలు జరిగాయని తేల్చి మరలా విజిలెన్స్‌కు రాయడం సరికాదని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన కమిషనర్లపై చర్యలకు సిఫార్సు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో బాధ్యులుగా ఉన్నవారందరికీ తగు శిక్షపడాలని సూచించారు. పైగా భూగర్భ డ్రైనేజీలోనూ రూ 20 కోట్లు అవినీతి బాగోతం జరిగిందని, ఆ వివరాలను కూడా త్వరలో బయటపెడతానన్నారు. ఓ మహిళా కమిషనర్ సంతకాలు చేసి పనులు జరగకుండానే బిల్లులు చేసిందని ఆరోపించారు. ఆనం ఫిర్యాదుతో బయటకు వచ్చిన ఈ నివేదిక రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది.

నేలబావుల రేడు.. తిక్కవరప్పాడు!

క్రమంగా తగ్గుతున్న వర్షపాతం కారణంగా దాదాపు అన్ని చోట్లా భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నడివేసవిలో 150 నుంచి 200 అడ్డుగుల లోతు ఉన్న బోర్లలో కూడా చుక్క నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. అయితే మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీలోని తిక్కవరప్పాడు, గొట్ల పాళెం గ్రామాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది.

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)

- రెండు గ్రామాల పరిధిలో 500 నేలబావులు
- తడి ఆరదు.. పంట ఎండదు..
- సర్వేపల్లి రిజర్వాయరు మాకు వరం
- తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామస్థుల హర్షం



తిక్కవరప్పాడు పొలాల్లోని నేల బావి

దాదాపు అన్ని ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ నేల బావులుంటాయి. అదే ఈ పంచాయతీ విశిష్టత. తిక్కవరప్పాడు పంచాయతీలోని తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో సుమారు 500 లకుపైగా గడపలుంటాయి. దాదాపు 3 వేల మంది జనాభా నివసిస్తుంటారు. ఇందులో 250 కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. మిగిలినవారు వ్యవసాయ కూలీలుగానూ, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు గ్రామాలకుగాను మూడు చెరువులుండగా సుమారు 900 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. వరి ప్రధానమైన పంట కాగా మిరప తక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. అలాగే ఇతర రకాల కూరగాయలు, ఆకు కూరలు కూడా పండిస్తుంటారు. ఈ రెండు గ్రామాల్లోని ఇళ్లల్లో సుమారు 350కి పైగా నేల బావులుంటాయి. అదే విధంగా పొలాల్లో సుమారుగా 120కి పైగా నేల బావులుంటాయి. ఏ బావి చూసినా 24 నుంచి 30 అడుగులకు మించి లోతు ఉండదు. అయితే ప్రతి బావిలోనూ వేసవిలో తప్ప మిగతా రోజుల్లో నీరు చేతికి అందే విధంగా ఉంటుంది.

● 300 ఎకరాలు సస్యశ్యామలం

ఈ బావుల వద్ద ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు పెట్టి నీటిని రైతులు తమ పొలాలకు తరలిస్తుంటారు. ఒక్కో బావి కింద రెండెకరాల చొప్పున రెండు గ్రామాల్లోనూ సుమారు 300 ఎకరాల వరకు సాగవుతుంది. ఇందులో 50 ఎకరాల వరకు మిరప, కూరగాయలు, ఆకుకూరలు, మిగిలిన విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. అయితే వేసవిలో మాత్రం బావుల్లో నీటిమట్టం తగ్గుతుంది. కాబట్టి ఏడాదికి ఒక పంటే సాగు చేస్తుంటారు. ఈ రెండు గ్రామాల్లోని ఇళ్లల్లోని బావుల్లో కూడా ఇదే తర



ఓ ఇంట్లో తవ్వుకుని ఉన్న నేలబావి

హాలో నీరు ఉంటుంది. వేసవిలో కూడా గ్రామస్థులు ఈ బావుల ఆధారంగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తుంటారు. ఎర్ర గులక నేలలుండే ఈ గ్రామంలో నీరు పుష్కలంగా లభిస్తుండడం తమ అదృష్టమని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే గ్రామ పొలాలను ఆనుకుని సర్వేపల్లి రిజర్వాయరు, పడమటి వైపున కనుపూరు చెరువు ఉండడం వల్ల బావుల్లో నీరు నిత్యం ఉంటుందని కొందరు గ్రామస్థులు చెబుతుంటారు. అయితే ఈ బావులు 100 ఏళ్ల క్రితం నుంచే గ్రామాల్లో సాగు, తాగు నీటిని అందిస్తున్నాయ ని వృద్ధులు చెబుతున్నారు. ఈ బావుల వల్ల తిక్కవరప్పాడు గ్రామంలో ఎప్పుడూ పంటలు ఎండిన దాఖలాలు లేవు. అదే విధంగా గ్రామస్థులు కూడా తాగు నీటికి ఇబ్బంది పడడం లేదు.

సర్వేపల్లి రిజర్వాయరు వల్లనే నీరు



తిక్కవరప్పాడు పంచాయతీకి సమీపంలో సర్వేపల్లి రిజర్వాయరు ఉంది. ఇందులో ఏడాది పొడవునా నీటిని నిల్వ చేస్తుంటారు. కనుపూరు చెరువు గ్రామం కన్నా ఎత్తులో ఉంది. అందు వల్ల గ్రామంలోని నేలబావుల్లో నీరు పుష్కలంగా ఉంటోంది. బావులు ఎక్కువ లోతు తవ్వాల్సిన అవసరం ఉండదు. 30 అడుగుల్లోనే స్వచ్ఛమైన నీరు లభిస్తుంది. ఏడాది పొడవునా బావుల్లో నీరు పుష్కలంగా ఉంటున్నందువల్ల పంటలు ఎండవు. అందు వల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కలుగుతోంది. ప్రతీ ఏటా పంటలు ఖచ్చితంగా పండుతున్నాయి.

- దొడ్డక మురళీమోహన్, తిక్కవరప్పాడు

ఊహ తెలిసిన నాటి నుంచే నేల బావులున్నాయి



తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో నా ఊహ తెలిసిన నాటి నుంచే ఇళ్లు, పొలాల్లో నేల బావులున్నాయి. మొదట్లో వీటి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ఆ తర్వాత మిగిలిన వారు కూడా బావులు తవ్వుకున్నారు. బావుల తవ్వకం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. చెరువుల కింద ఉన్న విస్తీర్ణంలో ఒక వంతు మెట్ట భూములున్నాయి. వీటికి చెరువుల నీరు అంతగా అందుబాటులో ఉండదు. అందువల్ల రైతులు బావులు తవ్వుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చారు. తక్కువ లోతులో నీరు లభిస్తుండడం వల్ల బావి తవ్వే ఖర్చు కూడా తగ్గుతుంది. దీంతో క్రమంగా బావులు తవ్వుకునే వారి సంఖ్య పెరిగింది.

- బోయపాటి సుధాకర్, తిక్కవరప్పాడు

వెంకటాచలం సర్పంచి చెక్‌పవర్ రద్దుకు నోటీసు

వెంకటాచలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, అక్రమాలపై సర్పంచి చెక్కు పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వారంలోగా వివరణ ఇవ్వాలంటూ మంగళవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి షోకాజు నోటీసులు జారీ చేశారు. వెంకటాచలం సర్పంచి మందల రాజేశ్వరి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నిధులు దుర్వినియోగం చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడ్డారని టీడీపీ నేత సండి రమేష్‌తో పాటు గ్రామస్థులు డీపీవోకు ఫిర్యాదు చేశారు.

ఈక్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంతోపాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. 2021 నుంచి 2025 సంవత్సరం వరకు జరిగిన లావాదేవీల్లో 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధులు దుర్వినియోగం చేయడాన్ని గుర్తించారు. సర్పంచితో సహా పంచాయతీలో పని చేసిన ప్రత్యేక అధికారి, కొందరు పంచాయతీ కార్యదర్శులను కూడా బాధ్యులుగా ఉన్నారని విచారణలో తేల్చారు. సర్పంచి రాజేశ్వరి నిబంధనలకు విరుద్ధంగా తన భర్త, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యను కాంట్రాక్టర్‌గా చూపించి వివిధ గ్రాంట్‌ల నుంచి తన భర్త అకౌంట్‌కు రూ.81.42,220, లబ్ధిదారులు కానీ వారి అకౌంట్‌కు రూ.4.81.268, డేటా ఎంట్రీ ఆపరేటర్ అకౌంట్‌కు రూ.1.84.668, గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్‌రావు కుమారుడు కే వంశీవెంకట్ అకౌంట్‌కు రూ.13.94.527, వివిధ పంచాయతీ కార్యదర్శుల అకౌంట్లకు రూ.5.56.258 జమ చేసి ఉన్నారు. గ్రాంట్ల నిధులను దుర్వినియోగం చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించిన డీపీవో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ కమిటీ అక్రమాలపై విచారణ చేపట్టి నివేదికను డీపీవోకు సమర్పించింది. ఈ నివేదికపై డీపీవో స్పందించి, వారంలోగా చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ సర్పంచికు నోటీసులు జారీ చేశారు. వివరణ ఇవ్వకుంటే చెక్‌పవర్ రద్దుతో పాటు ఏపీపీఆర్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

రేపు బొప్పరాజు రాక

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం నెల్లూరుకు వస్తున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్లు, అమరావతి సంఘ సభ్యులతో ఆయన సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

మద్యం కేసు నీరుగార్చే యత్నం?

(5వ పేజీ తరువాయి)

అదనంగా 1800 నుంచి 2 వేల బాటిళ్ల విక్రయించినట్లు నిర్ధారించుకున్నారు. ఇలా ఒక్క సర్వేపల్లిలోనే సుమారు 80 వేలకుపైగా మద్యం సీసాలు బల్క్‌గా బయటకు వెళ్లినట్లు గుర్తించారు. మరి ఇక జిల్లా మొత్తం విచారణ జరిపితే అక్కడ పరిస్థితేమిటన్నది కూడా తెలుస్తుందన్న వాదన వినిపిస్తోంది.

● ఆ అధికారి కనుసన్నల్లోనే!

సాధారణానికి మించి అమ్మకాలు జరిగిన షాపుల్లోని డేటాను ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నాటి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ సంస్థను కోరారు. ఆ వివరాలు అందితే ఎక్సైజ్ అధికారుల పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది. అలానే ఏఏ వ్యక్తులకు ఈ మద్యం చేరిందన్నది కూడా బయటపడుతుంది. కానీ ఈ సమాచారం ఎక్సైజ్ అధికారులకు అందడం లేదు. దీంతో మద్యం కేసుల విచారణ కూడా ముందుకు సాగడం లేదు. అయితే గతంలో జిల్లాలో పనిచేసినప్పుడు ఆరోపణలు ఎదుర్కొన్న అధికారి ఇప్పుడు తెరవెనుక కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివరాలు బయటకు వస్తే తనకు ఇబ్బందని భావించిన సదరు అధికారి.. ఎలాగైనా ఈ కుంభకోణం నుంచి బయటపడాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖలో చెప్పుకుంటున్నారు. కాగా ఈ కేసుల అంశంపై ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు నాయుడును వివరణ కోరగా అన్ని కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. అవసరమైన డేటాను ఇవ్వాలని గతంలో పనిచేసిన కన్సల్టెన్సీ సంస్థను కోరామని, ఇంకా ఆ వివరాలు అందలేదని వెల్లడించారు.

ఇంకా నియంతలానే
జగన్‌రెడ్డి!
● మాజీ సీఎంపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్



నెల్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీపాస్ ఉండాలంట! సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట! ఇవన్నీ జగన్‌రెడ్డి నియంతపోకడలకు నిదర్శనం. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌రెడ్డి ఇంకా నియంత పోకడల నుంచి బయటకు రావడం లేదు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం ఎన్నిసార్లు అడుక్కుంటారంటూ ఎద్దేవా చేశారు. 'అప్పట్లో ఓ మహిళ నుంచి పార్టీని కాపాడుకునేందుకు అందరం కలిసి ప్రజాస్వామ్యయుతంగా చంద్రబాబును ఎన్నుకున్నాం. ఈ రోజుకీ ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీని ఆదరిస్తూ గెలిపించుకుంటున్నారు. వెన్నుపోటు అయితే ప్రజలు ఆదరిస్తారా..? మీరు చిన్నాయన వివేకానందరెడ్డిపై గొడ్డలి పోటు వేసి, ఆ నెపాన్ని మాపై నెట్టి 2019 ఎన్నికల్లో గెలిచారు. ప్రజలు అంతా గ్రహించాకే మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. ఇప్పటికైనా కొంచెం కాకపోతే కొంచెమైనా బుద్ధితో మాట్లాడాలి' అంటూ వైసీపీ నేతలకు సోమిరెడ్డి హితవు పలికారు. కూటమి ప్రభుత్వంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.

ఆయుర్వేదానికి అందలం

- ప్రాచీన వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం
- జిల్లాలో 8 ఆసుపత్రులు వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు
- వైద్యులు, సిబ్బంది నియామకానికి అనుమతులు
- విలువైన పంచకర్మ చికిత్సలూ అందుబాటులోకి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీనమైన ఆయుర్వేద వైద్యానికి పూర్వ వైభవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధితో పాటు వైద్యులు, సిబ్బంది నియామకానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రస్తుతం ఉన్న 25 ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఎనిమిదింటిని అత్యాధునిక వెల్‌నెస్ కేంద్రాలుగా తీర్చిద్దాలని సంకల్పించింది. నెల్లూరు నగరం, డమ్మాయిపాళెం, జలదంకి, చిరమన, తోటపల్లి గూడూరు, సిద్దనకొండూరు, తెల్లపాడు, గండవరం ఆయుర్వేద ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య చికిత్సలు అందించేలా అభివృద్ధి చేయనున్నారు. వాటిలో యోగా కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులోకి పంచకర్మ చికిత్సలు

ఆయుర్వేద వైద్యంలో పంచకర్మ చికిత్సలు కీలకమైనవి. వేల రూపాయల విలువ చేసే ఈ చికిత్సలు కూడా జిల్లాలోని ఆసుపత్రుల్లో అందుబాటులోకి వచ్చాయి. నెల్లూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో కాళ్లు, కీళ్లు, మెడ నొప్పులు, వెన్నుముఖ నొప్పుల సమస్యలు, పక్షవాతం వంటి వ్యాధు



మూలాపేటలోని ఆయుర్వేద ఆసుపత్రి

లకు చికిత్స చేస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ 20 మంది వరకు పంచకర్మ చికిత్స చేయించుకుంటున్నారు. సిద్దనకొండూరు, డమ్మాయిపాళెం, తోటపల్లి గూడూరు ఆసుపత్రుల్లోనూ ఈ చికిత్సలు అందుబాటులోకి తీసుకు వచ్చేం దుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఆదరణ పెరుగుతోంది



నెల్లూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో పంచకర్మ చికిత్సలు అందిస్తున్నాం. ఆయుర్వేదానికి ప్రజలలో మంచి ఆదరణ ఉండటంతో ఇక్కడికి ప్రతిరోజూ 70 మంది వరకు వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. వారికి అవసరమైన మందులు అందిస్తున్నాము.

- డాక్టర్ సుధారాణి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్య నిపుణులు



రాజుపాళెం వద్ద పెన్నానదిలో లారీకి ఇసుక లోడ్ చేస్తున్న యంత్రం

నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు

● పెన్నానది లోపలికి రోడ్డు ఏర్పాటు

కలువాయి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం సమీపంలోని పెన్నా నదిలో నిబంధనల ప్రకారం మానవశక్తితో ఇసుక తవ్వకాలు జరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రెండు రోజులుగా యంత్రాలతో ఇసుక తవ్వి భారీ వాహనాలతో తరలిస్తున్నారు. ఇసుకను తరలించేందుకు ఏకంగా నది లోపలికి రోడ్డు ఏర్పాటు చేశారు. మండలంలోని రాజుపాళెం దగ్గర పెన్నానదిలో పూడిక తొలగింపునకు అధికారులు ఇటీవల టెండర్లు నిర్వహించి అనుమతులు మంజూరు చేశారు. అయితే నిబంధనల ప్రకారం ఇక్కడ మానవ శక్తితో పూడిక తీసి స్టాక్ యార్డ్‌కు తర లించి అక్కడ నుంచి ఇసుక విక్రయాలు చేయాల్సి ఉంది. కాగా, ఇక్కడ నదిలో నిబం ధనలకు నీళ్లు వదిలి యంత్రాలతో ఇసుక తవ్వి భారీ వాహనాలతో బయటకు తరలిస్తుండడంతో పేరుకేనా నిబంధనలు అంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్‌కు మున్సిపల్ మేయర్లు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేరళని కోచిలో ఈ నెల 12 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-2025కు హాజరయ్యేందుకు పలువురు మున్సిపల్ మేయర్లను, కమిషనర్లను ఎంపిక చేస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేరళ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ కాన్‌క్లేవ్‌కు గ్రేటర్ విశాఖ మేయర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్రతోపాటు సీడీఎంఏ, విజయవాడ మున్సిపల్ కమిషనర్, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హిందూపూర్ మున్సిపాలిటీ కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లు హాజరు కానున్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో నివాసముంటున్న దామరమడుగు అఖిల (18) అనే యువతి అదృశ్యమైనట్లు మంగళవారం కేసు నమోదు చేశామని రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన అందించిన వివ రాల మేరకు... వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదట సంవత్సరం చదువుతున్న అఖిల గత నెల 25వ తేదీ నుంచి కనపడటం లేదు. ఎంత వెతికినా ఫలితం లేనందున ఆమె తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముత్తుకూరుకు చెందిన హర్షపై అనుమానం ఉందని, అఖి లను తనకు ఇచ్చి పెళ్లిచేయాలని ఇటీవల హర్ష కోరాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.